విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





అనకాపల్లి | సంపుటి: 3 | సంచిక: 299 | గురువారం | 03-04-2025 | ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ | పేజీలు : 8 | వెల : 3.00


## తిరుమలలో తీసుకోవాల్సిన చర్యల పై సీఎం సమీక్ష

అమరావతి పెన్ సత్తా : తిరుమల పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో చేపట్టే చర్యలు చర్చించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు గత 9 నెలల కాలంలో తీసుకున్న చర్యల పై టీటీడీ (టీటీడీ) ప్రజెంటేషన్ ఇచ్చింది. పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో భవిష్యత్ లో చేపట్టే చర్యల పై టీటీడీ పెద్దలతో సీఎం సమీక్ష జరిపారు. టీటీడీ దర్శనాలు, వసతితో పాటు వివిధ సేవల పై భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాల పైనా చర్చించారు. బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సమాయాలతో పాటు, సాధారణ రోజుల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వారి అభిప్రాయాల పైనా చర్చకు వచ్చింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదంలో తీసుకువచ్చిన మార్పుల పై నివేదికను సీఎం చంద్రబాబుకు టీటీడీ ఇచ్చింది. గ్యాలరీల్లో సౌకర్యాల పెంపు, మరింత మంది భక్తులకు అవకాశం కల్పించేలా మాఢవీధులలో ఏర్పాట్లు, అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం, పద్మావతీ అమ్మవారి దేవాలయం అభివృద్ధి ప్రణాళిక, అమరావతి లోని శ్రీవారి దేవాలయం అభివృద్ధి పనులు వంటి అంశాల పై సమీక్షలో చర్చించినట్లు తెలుస్తోంది. తిరుమల ప్రతిష్ట పెంచడం, తిరుమల క్షేత్రాన్ని భక్తులకు మరింత దగ్గర చేయడం, సులభమైన, సౌకర్యవంతమైన సేవలకు సంబంధించి వివరాలను టీటీడీ అధికారులను అడిగి చంద్రబాబు తెలుసుకున్నారు. రాష్ట్రం వెలుపల ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయాల పురోగతి పై సీఎంకు నివేదిక సమర్పించింది టీటీడీ.



## నిధుల కోసం అప్పుల కెళ్లి న రాష్ట ప్రభుత్వం

అమరావతి పెన్ సత్తా : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం, ఆదాయ వనరుల సమీకరణ పై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా రుణాల పై ఎక్కువగా ఆధారపడింది. అధికారం లోకి రావడానికి ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన సూపర్ 6 హామీలను అమలు చేయడానికి అవసరమైన నిధులను కూడగట్టుకునే ప్రయత్నాల్లో పడింది. ఇందులో భాగంగా ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ బాండ్లు, స్టాక్స్ ను వేలానికి పెట్టే సంప్రదాయాన్ని అధికారం లోకి వచ్చినప్పటి నుంచీ కొనసాగిస్తోంది. ఇప్పటికే దశలవారీగా వేల కోట్ల రూపాయల విలువ చేసే సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి అప్పులకు వెళ్లింది కూటమి సర్కార్. తాజాగా 5,750 కోట్ల రూపాయలను సమీకరించు కోనుంది. దీనికి అవసరమైన అయిదు స్టాక్స్ ను రిజర్వ్ బ్యాంక్ వద్ద వేలానికి పెట్టింది. ఇందులో ఒక స్టాక్ విలువ 1,400 కోట్ల రూపాయలు. మరొకటి 1,350 కోట్ల రూపాయల విలువ చేసేది. మిగిలిన మూడు స్టాక్స్ విలువ ఒక్కొక్కటి 1,000 కోట్ల రూపాయలు. ఈ నెల 3 వ తేదీన అంటే గురువారం నాడు ఈ స్టాక్స్ వేలానికి రానున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (ఇ-కుబేర్) ద్వారా వేలం పాట సాగుతుంది. కాంపిటీటివ్, నాన్ కాంపిటీటివ్ బిడ్స్ రూపంలో వాటిని విక్రయిస్తుంది. ఈ స్టాక్స్ కాల వ్యవధి ఒకటి- 16, మరొకటి- 15, మిగిలిన మూడింటివి- 8, 9, 12 సంవత్సరాలు. వ్యక్తులు లేదా సంస్థలు వీటిని కొనుగోలు చేయవచ్చు. కాంపిటీటివ్ విధానంలో ఈ అయిదు స్టాక్స్‌ను కొనదలిచిన వారు గురువారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటలు, నాన్ కాంపిటీటివ్ విధానంలో వాటిని కొనదలిచిన వారు అదే తేదీన ఉదయం 10:30 నుంచి 11 గంటల మధ్య తమ బిడ్స్‌ను దాఖలు చేయాల్సి ఉంటుందని ఆర్బీఐ తెలిపింది. ఏపీతో పాటు మరి కొన్ని రాష్ట్రాలు తమ స్టాక్స్‌ను రిజర్వ్ బ్యాంక్ వద్ద వేలానికి పెట్టాయి. హిమాచల్ ప్రదేశ్- రూ. 900 కోట్లు, జమ్మూ కాశ్మీర్- రూ. 500 కోట్లు, మేఘాలయా- రూ. 350 కోట్లు, పంజాబ్- రూ. 3,300 కోట్లు, రాజస్థాన్- రూ. 1,000 కోట్ల రూపాయల మేర స్టాక్స్‌ను వేలానికి పెట్టాయి.




## ముస్లింల హక్కులను ఉల్లంఘించడమే ముఫ్తీ

శ్రీనగర్ : వక్ఫ్ సవరణ బిల్లుతో మోదీ ప్రభుత్వం ముస్లింల హక్కులను ఉల్లంఘిస్తోందని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం లోక్ సభ లో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వక్ఫ్ సవరణ బిల్లుని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ బిల్లు పై ఆమె మాట్లాడారు. ముస్లింలే లక్ష్యంగా ఈ బిల్లుని ప్రవేశపెట్టారని, ముస్లింల ఆస్తులను లాక్కునే ప్రయత్నమని దుయ్యబట్టారు. గత పదేళ్లుగా ముస్లింలకు వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగమే ఇది అని, ఇప్పుడు వక్ఫ్ సవరణ బిల్లుతో ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తోందని ముఫ్తీ ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ - ముస్లిం ఐక్యతకు ప్రతీక అయిన గంగా -జమున తెహజీబ్ ను ప్రస్తావిస్తూ దేశంలో సోదర భావాన్ని బిజెపి దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ చర్యలతో కలిగే దీర్ఘకాల పరిణామాల పై బిజెపి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ప్రస్తుతం బిజెపి అధికారంలో ఉండవచ్చని, కానీ రేపు బిజెపి అధికారంలో ఉండక పోవచ్చని కానీ వారు వెళ్లే సమయానికి దేశం మొత్తం నాశనమై పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ముస్లింల హక్కులను ఉల్లంఘిస్తోందని, కానీ రాబోయే కాలంలో దేశ మొత్తం దీని పరిణామాలను అనుభవించాల్సి ఉటుందని ఆవేదన వ్యక్తం చేశారు.



## వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు

న్యూ ఢిల్లీ : ఎన్డీయే కూటమిలో ముఖ్యమైన భాగస్వామి అయిన తెలుగుదేశం పార్టీ వక్ఫ్ (సవరణ) బిల్లుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే, ఈ బిల్లుకు నాలుగో సవరణను కూడా ప్రతిపాదించే అవకాశం ఉందని తెలుస్తోంది. టీడీపీ వర్గాల సమాచారం ప్రకారం, తుది బిల్లు ముసాయిదాలో వారు సూచించిన మూడు సవరణలు ఇప్పటికే చేర్చబడ్డాయి, దీని కారణంగా మద్దతు ఇవ్వడానికి సిద్ధమైనట్లు సమాచారం. టీడీపీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, టీడీపీ వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలపాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు వెల్లడించారు. కానీ, చర్చల సమయంలో, టీడీపీ ఎంపీలు ఒక ప్రధాన మార్పు కోసం పట్టు బడతారని చెప్పిన ఆయన, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరుల ప్రాతినిధ్యం విషయంలో నిర్ణయం తీసుకునే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలివేయాలని, ఈ మేరకు బిల్లులో సవరణ చేయాలని వారు కోరుతారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే భాగస్వాములైన టీడీపీ, జనసేన పార్టీలు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకుని, బుధవారం లోక్ సభ సమావేశాలకు హాజరు కావాలని తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. లోక్ సభ లో టీడీపీ కు 16 మంది, జనసేనకు ఇద్దరు సభ్యులు ఉన్నారు. టీడీపీ లోని ఒక ఉన్నత స్థాయి వర్గం తెలిపిన ప్రకారం, జేపిసిలో టీడీపీ ప్రతిపాదించిన మూడు సవరణలు తుది ముసాయిదా బిల్లులో చేర్చబడ్డాయి. కాబట్టి బిల్లుకు మద్దతు ఇవ్వడంలో ఎలాంటి సమస్య ఉండకపోవచ్చని చెప్పారు. మరోవైపు, ముస్లిం వర్గాల నుండి కొందరు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వవద్దని టీడీపీ, జనసేన లపై ఒత్తిడి తెచ్చారు. టీడీపీనేతృత్వం లోని ఎన్డీయే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులను బహిష్కరించాలని కొన్ని ముస్లిం సంఘాలు పిలుపునిచ్చాయి. ఇంతకు ముందు మార్చి 29 న, వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం సంస్థలు విజయవాడలో నిరసన ప్రదర్శనలు కూడా నిర్వహించాయి. జేపిసి సభ్యుడు కూడా అయిన టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణ దేవరాయలు, గతం లోనే ఈ బిల్లుకు మూడు సవరణలను ప్రతిపాదించిన విషయం తెలిసిందే.



## వక్ఫ్ బోర్డులో అత్యంత క్రూరమైన నిబంధన కారణంగా సవరణ

న్యూ ఢిల్లీ : దేశ రాజకీయాల్లో తీవ్ర వివాదానికి కారణమైన వక్ఫ్ సవరణ బిల్లు లోక్ సభ సమక్షానికి వచ్చింది. కేంద్ర న్యాయ, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు దీన్ని సభలో ప్రవేశ పెట్టారు. ఈ బిల్లు పై చర్చను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. సవరణల బిల్లు స్వభావం గురించి వివరించారు. వక్ఫ్ చట్టం 1995 లో అత్యంత వివాదాస్పదమైన సెక్షన్ 40 ని రద్దు చేయాలని ప్రతిపాదించినట్లు కిరణ్ రిజుజు తెలిపారు. ఈ సెక్షన్‌ను ప్రయోగించడం ద్వారా ఏదైనా ఒక భూమిని తమ ఆస్తిగా మార్చుకునే అధికారం వక్ఫ్ బోర్డుకు ఉందని అన్నారు. దీన్ని పూర్తిగా తొలగించాలని సవరణల బిల్లులో ప్రతిపాదించినట్లు వివరించారు. ఈ సెక్షన్ 40 ను అత్యంత దారుణమైన, క్రూరమైన నిబంధనగా అభివర్ణించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వక్ఫ్ చట్టం లోని అత్యంత దారుణమైన నిబంధన సెక్షన్ 40. దీని ప్రకారం ఆ బోర్డు ఏదైనా భూమిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించగలదు. ఇప్పుడు దాన్ని తొలగించాం అని రిజిజు తెలిపారు. ఈ బిల్లు వల్ల ముస్లింల ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుందని, వక్ఫ్ ఆస్తులకు రక్షణ ఉండబోదంటూ కొందరు ప్రతిపక్ష నాయకులు చెబుతున్నారని, అది అపోహ మాత్రమేనని అన్నారు. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన ఎవ్వరి భూమిని కూడా లాక్కోవడానికి అవకాశం ఉండదని స్పష్టం చేశారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు సెక్షన్ 40 నిబంధనను దుర్వినియోగం చేస్తోన్నారని కిరణ్ రిజిజు ఆరోపించారు. అందుకే వక్ఫ్ ఆస్తులు లక్షల్లో పెరిగాయని వ్యాఖ్యానించారు. ఈ వక్ఫ్ సవరణ బిల్లుకు యుమీద్ అంటే- యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్ మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ బిల్లు గా పేరు మారుస్తున్నట్లు కిరణ్ రిజిజు తెలిపారు. సెక్షన్ 40 ప్రకారం - ఏదైనా ఒక ఆస్తి వక్ఫ్ బోర్డుకు సంబంధించినదా?, కాదా?, అని నిర్ణయించే అధికారం వక్ఫ్ బోర్డుకు ఉందని, వక్ఫ్ ట్రిబ్యునల్ దాన్ని చేయకపోయినా, లేదా మార్పు చేయకపోయినా తుది నిర్ణయం బోర్డు,దే అవుతుందని కిరణ్ రిజిజు వివరించారు. తరువాయి భాగం 2 లో...



## నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

అమరావతి పెన్ సత్తా : రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఈ నెల 3 నుంచి 5 వ తేదీ వరకు మరలా 8 నుంచి 11 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న 0-6 సంవత్సరాల వయసు గల చిన్నారులందరూ ఈ సదావకాశాన్ని వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 0-6 సంవత్సరాల వయసు గల చిన్నారుల్లో 1,95,735 మందికి జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఉండగా, వీరందరూ ఇప్పటి వరకు ఆధార్ నమోదు చేయించు కోలేదు. ఆధార్ నమోదు చేయించు కోని చిన్నారుల్లో అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 12,218 మంది, అత్యల్పంగా అన్నమయ్య జిల్లాలో 4,001 మంది చిన్నారులున్నారు. ఆధార్ క్యాంపులను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయాలని శివప్రసాద్ పిలుపునిచ్చారు.



## సంపాద కీయం

# బెట్టింగ్ యాప్‌లకు జీవితాలు బలి

ప్రస్తుతం బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసేవాళ్లపై తెలంగాణ పోలీసులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ఇంకా యాప్స్ ప్రమోషన్‌ను ఆపడం లేదు. దేశవ్యాప్తంగా బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తూ కోట్లలో సంపాదిస్తున్నవాళ్లు వేల మంది ఉన్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో సెలబ్రిటీలే కాకుండా మరికొందరు బెట్టింగ్ టిప్స్ మాటున యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. టెలిగ్రామ్‌లో బెట్టింగ్ టిప్స్ పేరుతో ఛానళ్లు ఓపెన్ చేసి, అందులో మ్యాచ్ ప్రిడక్షన్స్ చెబుతూ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. ఇలా ఈజీ మనీ కోసం అలవాటు పడినటువంటి చాలా మంది యువతీ యువకులు ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆటలు ఆడి తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.సరదాగా ఆడటం మొదలుపెట్టి, ఆ ఆటలకు బానిసై, పెయిడ్ గేమ్స్, బెట్టింగ్ గేమ్స్ ఆడి దాచుకున్న డబ్బులను కోల్పోయి అప్పుల ఊబిలో చిక్కుకుపోయి, అప్పులు కట్టలేక తమ ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. అప్పుల పాలైనటువంటి వారు తిరిగి కట్టలేక ఇంట్లో వాళ్లకు చెప్పలేక, తమ ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇంకొందరైతే అప్పులు తీర్చేందుకు దొంగలుగా, చైన్స్ స్నాచర్లుగా, సైబర్ నేరగాళ్లుగా మారుతున్నారు. డబ్బుల కోసం ఇంట్లో వారిని చంపడానికి కూడా వెనకాడడం లేదు. బంధాలు బంధుత్వాలను కూడా మరిచి ప్రాణాలను తీస్తున్నారు. ఈ పెయిడ్ గేమ్స్, ఆన్‌లైన్ గేమ్స్ బారినపడి నేటి యువత తన భవిష్యత్తును నాశనం చేసుకుంటుంది. ఇందులో ఎక్కువగా 20 నుండి 35 సంవత్సరాల వయస్కులు ఎక్కువగా ఉండడం అందరినీ ఆందోళన కలిగించే విషయం. ఈజీ మనీ కోసం అలవాటు పడినటువంటి వారు ఇంటర్నెట్‌లో లేదా స్మార్ట్ ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లను వెతికి అందులోని రమ్మి, ఐపిఎల్ బెట్టింగ్, ఫ్రీ మనీ ఎర్నింగ్ యాప్స్ అని ఎన్నో యాప్‌లను ఉపయోగిస్తూ ఆన్ లైన్‌లో సరదాగా మొదలుపెట్టిన ఆటలు, చివరికి వాటికి అలవాటు పడి జీవితాన్ని బలి తీసుకునే దిశగా వెళ్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా టెలిగ్రామ్‌లో క్రికెట్ అనలిస్టు పేరుతో ఒకరు, సౌత్ ఇండియా కింగ్ పేరుతో మరొకరు విపరీతంగా బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. ప్రిడక్షన్స్ ఇవ్వడం ద్వారా మీరు లాభాలు సంపాదించండంటూ తమ ఛానల్‌ను, బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నారు. ఇలా టెలిగ్రామ్, వాట్సప్‌లో గ్రూపులు ఓపెన్ చేస్తూ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌ను చాలా మంది ఓ వృత్తిగా ఎంచుకుంటున్నారు. కొందరికి అవి ఆన్‌లైన్ గేమ్స్ అని, క్రికెట్ బెట్టింగ్ అని తెలియకుండానే ఆ ఊబిలో చిక్కుకొని పోతున్నారు.కరోనా సమయంలో పిల్లలకు ఆన్ లైన్ క్లాసులు జరిగేవి. అలాంటి సమయంలో పాఠశాల విద్యార్థులు మొదలుకొని కళాశాలలో చదువుకునేటువంటి యువతీ యువకులు, నిరుద్యోగులు, ఉద్యోగ ఉపాధి లేనివారు ఈజీగా డబ్బులు సంపాదించాలనే యావతో ఆన్ లైన్ ఆటలకు అడిక్ట్ అయ్యి, వాటిపై ఇంట్రెస్ట్ చూపి, డబ్బులు డిపాజిట్ చేసి గేమ్ ఆడితే సంపాదించవచ్చు అన్న ఆశలతో అప్పులు చేసి, అప్పుల ఊబిలో కూరుకుపోయి కష్టపడి సంపాదించిన దాన్నంతా కూడా పోగొట్టుకుంటున్నారు. బెట్టింగులను ఆర్గనైజ్ చేసే వాళ్ళు మొదట్లో కావాలనే కొంత డబ్బును యూజర్లు గెలుచుకునేలా చేస్తారు. దీంతో ఉత్సాహంగా మరింత సొమ్ము తెచ్చి గేమ్స్ ఆడుతూ బెట్టింగ్ కడుతుంటారు. డబ్బులు పోగొట్టుకున్నా మళ్లీ రాకపోతాయని ప్రయత్నిస్తూ నిండా మునిగిపోతుంటారు. కొద్ది రోజులుగా రాష్ట్రంలో చాలా మంది యూత్ ఇలాగే నష్టపోయారు. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు వివిధ రకాల యాప్‌లు , వెబ్ సైట్‌ల ద్వారా బిజినెస్ చేస్తున్నాయి. ఇప్పుడు గూగుల్, పేటిఎం, ఫోన్ పేలో ద్వారా కూడా ఈ ఆటలను అందుబాటులోకి తీసుకొచ్చాయి. కొన్ని సంస్థలు పెయిడ్ గేమ్స్ ద్వారా గేమర్స్‌కి మనీ ఇస్తున్నాయి. ఆన్‌లైన్ రమ్మీ వంటి గేమ్‌లకు రూ. 50 నుంచి కూడా డబ్బు పెట్టే చాన్స్ ఉంటుంది. ముందు కొంత అమౌంట్ గేమ్ ఆడే వారి అకౌంట్‌లోకి వస్తుంది. దీంతో పాటు గేమ్‌లకు రివార్డ్ ఇస్తూ ఆకర్షిస్తుంటారు. టి 20లు, వన్ డేలు, ఐపిఎల్, ఆఖరికి టెస్ట్ మ్యాచ్‌లు, ప్రో కబడ్డీ, రమ్మీ, పేకాట వీడియో గేమ్స్ ఇలా ఆన్ లైన్ మోసానికి బలవుతూ ఉన్నారు. ఇవేకాక ఆన్ లైన్ స్పాట్, బ్లాక్ జాక్, బక్కట్ పోకర్, తీన్ పట్టి, అందరు బహార్, ఆన్‌లైన్ క్యాష్‌ను ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో యాప్‌లు, ఆన్‌లైన్‌లో మోసాలు పెరిగిపోయి, మొదట్లో రూపాయల్లో ఆశపెట్టి వందల్లో లాభాలు చూపి, తర్వాత వేళల్లో ఆశపెట్టి లక్షలు దోచేస్తున్నారు. నేటి యువతీ యువకులకు పలు రకాల ఆటలపై ప్రజల్లో ఉన్న మోజును క్యాష్ చేసుకునేందుకు నకిలీ యాప్‌లను సృష్టించి, వాటి ద్వారా కూడా సులువుగా డబ్బులు సంపాదిస్తున్నారు. ఈ బెట్టింగ్ ఆన్ లైన్ గేమ్‌ల ద్వారా, బెట్టింగ్ యాప్‌ల ద్వారా, ఇంకా కొన్ని యాప్‌ల గనుక చూస్తే ఇంకా ముందుకు వెళ్లి వారే రుణాలు ఇస్తూ మళ్లీ డబ్బులు కట్టించి అదే గేమ్‌కు బానిసగా కూడా చేస్తున్నారు.స్మార్ట్ ఫోన్లు రాకముందు ప్రశాంతమైన జీవితం గడిపినటువంటి వారు స్మార్ట్ ఫోన్లు వచ్చిన తర్వాత జీవితాలను బలి తీసుకుంటున్నారు. ఈ ఆన్ లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు చైనా, సౌదీ అరేబియా, అరబ్ దేశాల నుంచి ఆపరేటింగ్ చేస్తుంటారు. ఇటీవల చత్తీస్‌గఢ్ లో వెలుగు చూసిన మహాదేవ యాప్ కేసులో ఇదే విషయం తేటతెల్లమైంది. ప్రముఖులతో యాడ్స్ ఇప్పించడం అమాయకులను ముగ్గులోకి దించడం ద్వారా డబ్బులు వసూలు చేయడం, మొత్తంగా ఆటలకు బానిసలు చేయడం నిత్యకృతమైంది. ఇటీవల కాలంలో ఒక కలెక్టర్ దగ్గర పనిచేసేటువంటి గన్‌మెన్ సైతం అప్పుల ఊబిలో చిక్కి తన కుటుంబంతో సహా ప్రాణాలను కోల్పోయారు. ఇలా ఆన్‌లైన్ మోసాలతో దేశంలో కొన్ని వందల మంది ప్రాణాలను కోల్పోవడం జరుగుతున్నది. ఈ దారుణాలు జరుగుతున్నటువంటి క్రమంలో స్మార్ట్‌ఫోన్ల వాడకం తగ్గించడం మేలు. ఖాళీగా ఉంటూ ఏదైనా చూస్తున్న కొద్దీ ఏవేవో ప్రకటనలు, ఆకర్షించే బొమ్మలు, ఆటలు, మన డిస్‌ప్లే మీద ఆకర్షిస్తూ ఉంటాయి. మరి అలాంటి తరుణంలో వాటి జోలికి పోకుండా వాటిని యాపులను డౌన్‌లోడ్ చేసుకోకుండా ఉంటే మంచిది. వాటి మీద టచ్ చేస్తే ఆ యాప్‌లు డౌన్‌లోడ్ అయి మీ అకౌంట్లో ఉన్నటువంటి డబ్బులు గానీ లేదా డబ్బులు పెట్టి నష్టపోయేటువంటి పరిస్థితి గానీ వస్తుంది. దానివల్ల ఇంట్లో అనర్థాలు, ఇబ్బందులు, అప్పుల గొడవలు, మనస్పర్థలు, ప్రశాంతత లేక ఆత్మహత్యల ఆలోచనలు వచ్చే ప్రాణాలనే బలి తీసుకునేటువంటి అవకాశం ఉంటుంది. అందుకే స్మార్ట్ ఫోన్‌లో కానీ, ఇంటర్నెట్‌లో కానీ తెలిసినటువంటి యాపులను వినియోగించడం మంచిది. తెలియని యాప్‌ల జోలికి వెళ్ళకూడదు. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్ బారిన పడి లక్షల్లో అప్పులు చేసి తీర్చలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతూ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న ఘటనలు అధికంగా జరుగుతున్న వేళ ఈ యాప్స్ ప్రమోషన్‌తో పాటు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది. అలాగే వారిపై చర్యలు తీసుకొని, ఉజ్వల భవిష్యత్తు వున్న భవితను కాపాడుదామని ఆశిద్దాం.

# ప్రకాశంలో సీబీజీ ప్లాంట్ కు లోకేష్ భూమి పూజ

ప్రకాశం పెన్ సత్తా : ప్రకాశం జిల్లాలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ (సీబీజీ) ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన జరిగింది. పీసీపల్లి మండలం దివాకరపల్లి సమీపంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న ఈ ప్లాంట్‌కు ఎపి మంత్రి లోకేష్ భూమి పూజ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం రిలయన్స్ సంస్థ రూ.65 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ నిధులతో మొత్తం 500 సీబీజీ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా సుమారు 2.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు. ఈ ప్లాంట్ల ద్వారా వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి హరిత, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి అవుతుందని మంత్రి లోకేష్ తెలిపారు. ప్రతి సీబీజీ ప్లాంట్ రోజుకు 22 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. నిరుపయోగంగా ఉన్న దాదాపు 5 లక్షల ఎకరాల భూమిని ఎనర్జీ ప్లాంటేషన్ కోసం వినియోగించనున్నారని చెప్పారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# వక్ఫ్ బోర్డులో అత్యంత క్రూరమైన నిబంధన కారణంగా సవరణ

మొదటి పేజీ తరువాయి భాగం.... ఆ స్థలం వక్ఫ్ పరం కావడానికే అవకాశం అధికంగా ఉందని చెప్పారు. వాటి,పై కోర్టుల్లో అప్పీల్ చేయడానికి అనుమతి లేదని పేర్కొన్నారు. ఇలాంటి వివాదాలు దేశవ్యాప్తంగా వెలుగు లోకి వస్తున్నాయి అని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 14,000 కు పైగా వక్ఫ్ ఆస్తుల వివాదాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వక్ఫ్ బోర్డు, ట్రిబ్యునల్ నిర్ణయాల పై అసంతృప్తిగా ఉంటే- న్యాయ స్థానాలను ఆశ్రయించే అవకశాన్ని ఈ సవరణల ద్వారా కల్పిస్తున్నామని, దీన్ని మరింత సులభతరం చేశామని చెప్పారు. ఏదైనా ఆస్తి వక్ఫ్ బోర్డుకు చెందుతుందా?, లేదా?, అనే అధికారం ఈ సవరణల ద్వారా జిల్లా కలెక్టర్‌కు లభిస్తుందని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. క్యాథలిక్ క్రైస్తవులు కూడా వక్ఫ్ బిల్లును ఆమోదించాలని కోరుకుంటోన్నట్లు చెప్పారు. కేరళ లోని ఓ మత్స్యకార గ్రామంలో 600 కు పైగా క్రైస్తవ కుటుంబాలు నివసించే భూమిని, చర్చిని తమదిగా వక్ఫ్ బోర్డు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే- హర్యానా లోని జత్లానలో గురుద్వారా భూమిని వక్ఫ్ ఆస్తిగా పేర్కొన్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఇందులో సవరణలు గనక చేయకపోతే దేశంలోని పార్లమెంట్ భవనం, ఢిల్లీ విమానాశ్రయం, సీజీవో కాంప్లెక్స్‌లను కూడా వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించే అవకాశం ఉండేదని రిజిజు వ్యాఖ్యానించారు.

# 2,500 కేజీల డ్రగ్స్ స్వాధీనం



న్యూ దిల్లీ : భారత నేవీకి చెందిన ఐఎన్‌ఎస్ తర్కాష్ బుధవారం 2,500 కేజీల డ్రగ్స్ (నార్కోటిక్స్)ను స్వాధీనం చేసుకుంది. సముద్ర భద్రతా కార్యకలాపాల కోసం పశ్చిమ హిందూ మహాసముద్రంలో ఈ ఏడాది జనవరిలో ఐఎన్‌ఎస్ తర్కాష్‌ను మోహరించిన సంగతి తెలిసిందే. ఇటీవల సముద్రంలో భారత నావికా దళం, తీర భద్రతా దళాలు డ్రగ్స్ పై జరిపిన దాడుల్లో ఇది తాజాది. బహ్రెయిన్‌కి చెందిన కంబైన్డ్ మారీ టైమ్ ఫోర్సెస్ (సిఎంఎఫ్)లో భాగమైన కంబైన్డ్ టాస్క్ ఫోర్స్ (సిటిఎఫ్) 150, బహుళ -జాతీయ ఫోర్సెస్ జాయింట్ ఫోకస్ ఆపరేషన్ ఐంజాక్ టైగర్‌లు సంయుక్తంగా ఐఎన్‌ఎస్ తర్కాష్ పై కార్యకలాపాలు చేపట్టినట్లు భారత నేవీ తెలిపింది. తీర భద్రతా దళాలతో పాటు ప్రత్యేక బోర్డింగ్ బృందం అనుమానిత నౌకలను గుర్తించాయని, సోదాల్లో పలు సీల్ చేసిన ప్యాకెట్లు లభించినట్లు నేవీ ఒక ప్రకటనలో తెలిపింది. తిరిగి సోదాలు, విచారణలో నౌకలో వివిధ కార్గో హోల్డ్‌లు కంపార్ట్ మెంట్లలో నిల్వ చేయబడిన 2,500 కిలో లకు పైగా డ్రగ్స్ (2,386 కిలోల హషీష్, 121 కిలోల హెరాయిన్) బయటపడినట్లు పేర్కొంది.

# అక్రమ మైనింగ్ కేసులో కాకాణికి మూడోసారి నోటీసులు




అమరావతి పెన్ సత్తా : అక్రమ మైనింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ వైసిపి నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి కి నెల్లూరు జిల్లా పోలీసులు మరోసారి నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేశారు. హైదరాబాద్, శ్రీనగర్ కాలనీ లోని కాకాణి నివాసానికి కావలి పోలీసుల బృందం వెళ్లింది. కాకాణి ఇంట్లో లేరని చెప్పడంతో ఆయన బంధువులకు నోటీసులు ఇచ్చారు. అక్రమ మైనింగ్ కేసులో ఏప్రిల్ 3న (గురువారం) నెల్లూరు రూరల్ డీఎస్పీ ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే రెండు సార్లు కాకాణికి నోటీసులు అందజేసినప్పటికీ ఆయన విచారణకు హాజరుకాకపోవడంతో మరోసారి నోటీసులు ఇచ్చారు.

# వక్ఫ్ బిల్లును బలవంతంగా రుద్దితే ఉద్యమానికి సిద్ధం ఎఐఎంఐఎం



న్యూ దిల్లీ : వక్ఫ్ సవరణ బిల్లును ఆల్ ఇండియా మజ్లిస్ ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) తీవ్రంగా వ్యతిరేకించింది. అయినప్పటికీ నేడు లోక్ సభ లో కేంద్ర మంత్రి రిజిజు ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లును తమ పై బలవంతంగా రుద్దితే దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం అని ఎఐఎంఐఎం దిల్లీ అధ్యక్షుడు షోయబ్ జమై హెచ్చరించారు. మైనారిటీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పై దాడులను సహించేది లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన బుధవారం సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ముస్లింల పై వక్ఫ్ బిల్లును బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమం జరుగుతుంది. ఆ ఉద్యమానికి నాంది దిల్లీ నే అవుతుంది. దిల్లీ నుంచే ఈ ఉద్యమం ప్రారంభమవుతుంది. గతసారి ఉద్యమం ముగిసిన చోట నుండే ఈ ఉద్యమం ప్రారంభమవుతుంది. మేము మా ప్రజాస్వామ్య హక్కుల్ని ఉపయోగిస్తాము. రాజ్యాంగంలో మైనారిటీలకు ఇచ్చిన హక్కుల పై ఎటువంటి దాడిని మేము సహించము అని, జమై ఎక్స్ పోస్టులో కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాగా, మార్చి 28 న దిల్లీ లో జంతర్ మంతర్ వద్ద ముస్లింలు ఈ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. అలాగే పాట్నాతో పాటు, పలు రాష్ట్రాల్లో కూడా ఈ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నిరసనలు చేశారు.

# యెమెన్ పై అమెరికా దాడులు నలుగురు మృతి



హుడైదా : తాజాగా అమెరికా యెమెన్ పై వైమానిక దాడికి పాల్పడింది. మంగళవారం రాత్రి యెమెన్ లోని హుడైదా ప్రాంతం లోని నీటి నిర్వహణ భవనం పై అమెరికా జరిపిన దాడిలో నలుగురు మృతి చెందినట్లు తాజాగా తహౌతి ఆరోగ్యమంత్రిత్వ శాఖ వెల్లడించింది. మధ్యప్రాచ్యాన్ని యుద్ధ విమానాలతో మోహరిస్తున్నట్లు ఇటీవల అమెరికా ప్రకటించింది. ఈ క్రమంలోనే తాజాగా యెమెన్ పై దాడికి పాల్పడింది. మంగళవారం రాత్రి అమెరికా జరిపిన దాడిలో ముగ్గురు మృతి చెందినట్లు నిర్ధారించినట్లు హౌతి ఆరోగ్యశాఖా ప్రతినిధి అనీస్ అలాస్బాహి తెలిపారు. మంగళవారం రాత్రి హుదేయిదా గవర్నరేట్ లోని అల్ మన్సౌరియా జిల్లా లోని నీటి నిర్వహణ భవనాన్ని లక్ష్యంగా చేసుకుని అమెరికా దళాలు జరిపిన దాడిలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ దాడిలో బలైంది ఎక్కువమంది ఉద్యోగులే అని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో హౌతి అనుబంధ అల్ మసిరా టీవీ మృతుల సంఖ్య నాలుగుకి పెరిగిందని నివేదించింది. వాయువ్యం లోని హజ్జా ప్రాంతం, ఉత్తరాన సాదా పై కూడా దాడి జరిగిందని స్థానిక మీడియా వెల్లడించింది. మార్చి 15 న యెమెన్ లోని హౌతి దళాల పై, అమెరికా దళాలు సైనిక దాడి చేసింది. ఈ దాడిలో యెమెన్‌లో 60 మందికిగా మృతి చెందారు. మరోవైపు గాజాలో ఇజ్రాయిల్ కాల్పుల విరమణను ఉల్లంఘించినందుకు ప్రతి స్పందనగా ఎర్ర సముద్రంలో ఇజ్రాయిల్ నౌకల పై దాడిని తిరిగి ప్రారంభిస్తామని, యెమెన్ సాయుధ బృందం బెదిరించింది. ఈ నేపథ్యంలోనే యెమెన్ పై అమెరికా దళాలు దాడికి పాల్పడ్డాయి.



# సంచార జాతుల అభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయం మంత్రి సవిత

**- బెగ్గింగ్ నిర్మూలనే చంద్రబాబు ధ్యేయం.**

**- సంచార జాతుల్లో విద్యకు లోకేష్ ప్రాధాన్యం.**

**అమరావతి పెన్ సత్తా ఏప్రిల్ 02 :** రాష్ట్రంలో ఎం బీసీ కులాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో ఉన్నారని, ఇళ్ల స్థలాలతో పాటు ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు అందజేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎం బీసీ లకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చనున్నట్లు తెలిపారు. అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలో ఎంబీసీ కుల సంఘాల నాయకులతో మంత్రి సవిత భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఆ కులాల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, కూటమి విజయంలో ఎంబీసీ కులాలు ముఖ్యపాత్ర పోషించాయన్నారు. సంచార జాతులను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చేయాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. సమావేశంలో తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి అంశాన్నీ సీఎం చంద్రబాబుకు వివరిస్తానన్నారు. ఎంబీసీ సమస్యల పై సీఎం చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో సంచార జాతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని స్పష్టంచేశారు. సంచార జాతులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తామన్నారు. ఇళ్ల స్థలాలతో పాటు ఆధార్ కార్డులు, గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఉన్న ఇబ్బందులను తొలగిస్తామన్నారు. కళాకారులకు పెన్షన్ల మంజూరు విషయమై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సంచార జాతుల పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్లో అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. ఆదరణ పథకంలో భాగంగా సంచార జాతులకు అవసరమైన పరికరాలు సమకూర్చుతామన్నారు. రాష్ట్రంలో బెగ్గింగ్ అనే మాటే వినబడకూడదని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి సవిత తెలిపారు. అందుకోసమే ఎంబీసీకి చెందిన సంచార జాతులతో స్వయం ఉపాధి పథకాల్లో భాగంగా యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని వ్యాపారవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. 2014-19 మధ్య బ్యాంకులతో సంబంధం లేకుండా 90 శాతం సబ్సిడీతో సంచార జాతులకు సీఎం చంద్రబాబు నాయుడు రూ.30 వేల మేర ఆర్థిక చేయూత అందించారన్నారు. అదే మాదిరిగా ఎంబీసీ లకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా అందజేయ నుందన్నారు. గతంలో కంటే అదనంగా ఆర్థిక సాయమందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిరక్షరాస్యత కారణంగానే సంచార జాతులు అభివృద్ధిని నోచుకోలేకపోతున్నాయని మంత్రి సవిత ఆవేదన వ్యక్తంచేశారు. సంచార జాతుల వారు తమ పిల్లలను విద్యకు దూరం చేయొద్దని సూచించారు. విద్యతోనే ఆర్థికంగా, సామాజికంగా గుర్తింపు లభిస్తుందన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా పిల్లలను బడులకు పంపాలని, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ అండగా నిలుస్తారని భరోసా ఇచ్చారు. రెసిడెన్షియల్ స్కూళ్లో సంచార జాతుల పిల్లలకు నేరుగా అడ్మిషన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే విషయమై మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మాదిరిగా విద్యా సంస్థల్లో రాయితీ పై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానన్నారు. అర్హులైన సంచార జాతుల విద్యార్థులకు విదేశీ విద్యా పథకం కింద అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎంబీసీ నాయకులు మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వ హయాం లోనే తమకు న్యాయం జరిగిందని, మరోసారి సీఎం చంద్రబాబు నాయుడు అధికారం లోకి రావడంతో, తమ బతుకులకు భరోసా లభించిందని ఆశాభావం వ్యక్తంచేశారు. అనంతరం మంత్రి సవిత ను ఎంబీసీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.









# రెవిన్యూ సేవలలో జాప్యం ఉండ కూడదు జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్

**- పేదవారికి ఉచిత విద్యుత్ పంపిణీకి సోలారు యూనిట్ల ఏర్పాటు**

**అనకాపల్లి,పెన్ సత్తా, ఏప్రిల్ 02 :** రెవిన్యూకు సంబందించిన సేవలలో జాప్యం ఉండకూడదని, సేవలకు సంబంధించిన ధరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరం నుండి రెవిన్యూ శాఖకు సంబంధించిన రీ సర్వే, మ్యుటేషన్లు, ఇంటి స్థలాలు, క్రమబద్దీ కరణ, నీటితీరువా వసూలు తదితర అంశాల పై తహాశీల్దార్లతో జిల్లా కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ సమీక్ష నిర్వహిస్తూ రెవిన్యూ సేవలకు సంబంధించిన ధరఖాస్తుల పై గడువు లోపల చర్యలు తీసుకోవాలని తెలిపారు. రీసర్వే పనులు వేగవంతం చేయాలని తెలిపారు. కొన్ని మండలాలలో ఆటో మ్యుటేషన్లు పెరగడం, ఎక్కువ మ్యుటేషన్లను తిరస్కరించడం పై నివేదిక అందజేయాలని తహాశీల్దార్లను ఆదేశించారు. దీని పై రెవిన్యూ డివిజినల్ అధికారులు రోజు వారీ పర్యవేక్షణచేసి నివేదిక అందించాలని తెలిపారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో తేది.15.10.2019 నాటికి ఇళ్లు కట్టుకొని, ప్రస్తుతం నివాసముంటూ, ఇంటికి సంబంధించిన ఆధార పత్రాలు కలిగి, ఎక్కడా ఇళ్లు లేని వారికి ప్రభుత్వం కల్పించిన క్రమబద్దీకరణ పథకానికి సంబంధించిన ధరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. కొత్తగా ఇంటి స్థలాల కొరకు ధరఖాస్తు చేసుకొన్నవారికి కేటాయించుటకు ప్రస్తుతం గల లే అవుట్ లలో అందుబాటులో గల స్థలాల వివరాలు సేకరించి సిద్దంగా ఉంచుకోవాలన్నారు. రీ-సర్వే కు సంబంధించి వివరాలు నమోదు, హద్దులు నిర్ణయం భూ యజమానులు సమక్షం లోనే చేయాలని, భూమి లేనివారికి భూమిఉన్నట్లు నమోదు చేసిన యెడల కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయకట్టు భూములకు నీటి తీరువా వసూలు చేయాలని, జిల్లాలో సుమారు 17 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని, వారం రోజులలో వసూలుపూర్తి చేయుటకు చర్యలుతీసుకోవాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి పెండింగు లేకుండా వెంటనే కోర్టులలో కౌంటర్లు దాఖలు చేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్వారా వచ్చే ధరఖాస్తులకు మీ దగ్గర గల సమాచారాన్ని వెంటనే గడువు లోపల అందించాలన్నారు. పదవీ విరమణ చేయుచున్న ఉద్యోగులకు సంబంధించిన పెన్షను ప్రపోజల్స్ ముందుగానే పంపించాలని, వారికి అందించవలసిన ఆర్థిక ప్రయోజనాలను పదవీవిరమణ రోజునే అందించి, గౌరవప్రదంగా సాగనంపేలా చర్యలు తీసుకోవాలని తెలియజేసారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చాలని, అందుకుగాను నాటుసారా కు సంబంధించిన సమాచారాన్ని గ్రామ అధికారులు ఎక్సైజ్ శాఖకు అందించాలని, ఎక్సైజ్ శాఖ దాడులు చేసినప్పుడు వారికి సహకరించాలని తెలిపారు. నాటు సారా తయారీ, రవాణా విక్రయాలు చేస్తూ, తరచూ నేరం చేసేవారిపై బైండోవరు చేయునపుడు కఠినంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్.సి., ఎస్.టి. వినియోగదారులకు ఉచిత కరెంటు అందించుటకు వారి ఇంటి పై సోలారు యూనిట్లు ఏర్పాటు చేయాలని, స్థలం లభ్యత లేని వారికి సరఫరాచేయుటకు ఎపి ఇపిడిసిఎల్ ద్వారా సోలారు యునిట్ ఏర్పాటుకు కనీసం 50 సెంట్లు ఉండే విధంగా భూమిని గుర్తించి వివరాలు అందించాలని తెలిపారు. అందుకు గాను లే అవుట్ లలో సామాజిక అవసరాలకు విడిచిపెట్టిన స్థలాలను కూడా పరిశీలించాలని జిల్లా కలెక్టరు పేర్కొన్నారు. జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి మాట్లాడుతూ రెండవ విడత రీ సర్వే చేపడుతున్న గ్రామాలలో గ్రామసభలు నిర్వహించాలని, రీ సర్వే పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముందుగా భూ యజమానులకు నోటీసులు అందజేయాలని తెలిపారు. సర్వేకు అదనపు సిబ్బంది అవసరమైతే కేటాయించడం జరుగుతుందని తెలిపారు. వార్తాపత్రికలలో వచ్చే ప్రతికూల వార్తల పై వెంటనే చర్యలు తీసుకొని, నివేదికను అందజేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, సర్వే లేండు రికార్డు సహాయ సంచాలకులు గోపాలకృష్ణ, కె.కె.ఆర్.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్. మూర్తి, ఆర్.డి.ఒ.లు, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్ లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.





# లక్ష టన్నులు క్రస్సింగ్ జరిపిన చోడవరం షుగర్స్

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 02:** చోడవరం చక్కెర కర్మాగారంలో బుధవారం ఉదయానికి లక్ష టన్నులు చెరుకు గానుగ ఆడింది. ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని లక్ష టన్నులు క్రస్సింగ్ జరపగా మరొక 8 వేల టన్నులు చెరుకు గానుగ ఆడే అవకాశం ఉంది. గత సీజన్లో లక్ష 70 వేల 601 టన్నులు జరపగా లక్ష 46 వేల 309 క్వింటాళ్ల చక్కెర ఉత్పత్తి జరిపింది. అలాగే కో జనరేషన్ ప్లాంట్ ద్వారా 19 లక్షల 4 వేల 300 యూనిట్లు కరెంటు విద్యుత్ శాఖకు సరఫరా చేసింది. ప్రభుత్వ సహకారం లేకపోవడం వలన గత ఏడాది చెరుకు బకాయిలు ఇంకా పూర్తిగా చెల్లించినప్పటికీ ఈ ఏడాది ఉత్పత్తి అయిన పంచదారను అమ్మి ఫ్యాక్టరీ ఎండి వి.ఎస్ నాయుడు రైతులకు టన్నుకు రూ 3 వేలు చొప్పున పేమెంట్లు ఇవ్వడానికి షెడ్యూల్ వేసి ప్రారంభించారు. జనవరి 21 నుండి ఫిబ్రవరి 4 వరకు సప్లై చేసిన చెరుకు రైతులకు షెడ్యూల్ ప్రకారం మొదట విడతగా టన్నుకు రూ 3 వేలు చొప్పున పేమెంట్లు వేస్తున్నారు. ఈ సీజన్లో చెరుకు మద్దతు ధర టన్నుకు రూ 3150 కాగా, రూ 3 వేలు చొప్పున పేమెంట్లు ఇవ్వడానికి ప్రారంభించడంతో రైతుల్లో కాస్త ఆసక్తి కనబడినా చెరుకు సాగుబడి గణనీయంగా తగ్గడంతో లక్ష టన్నులకే పరిమితమైంది. రైతులకు చెరుకు పంట గిట్టుబాటు కాకపోవడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అంతగా లేకపోవడంతో ఆర్థిక సంక్షోభంలో ఫ్యాక్టరీ కూరికిపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకుంటే గోవాడ ఫ్యాక్టరీ గాడిలో పడే అవకాశం ఉంది. రైతులు, కార్మికుల బకాయిలు చెల్లిస్తే ఊపు అందుకుంటుంది. ఫ్యాక్టరీ మీద చోడవరం మాడుగుల నియోజకవర్గాలకు చెందిన 24 వేల మంది రైతులు, వెయ్యి కార్మికుల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. కొత్తగా పరిశ్రమలు తీసుకురాలేకపోయినా కనీసం ఉన్న ఫ్యాక్టరీని కాపాడాలని పలువురు కోరుతున్నారు.



# ప్రత్యేక అమ్మకాల కేంద్రాలు ద్వారా బియ్యము, కంది పప్పు అమ్మకం

**అనకాపల్లి,పెన్ సత్తా, ఏప్రిల్ 02:** జిల్లా వ్యాప్తముగా ప్రత్యేక అమ్మకాల కేంద్రాల యందు బియ్యము, కంది పప్పు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం విక్రయిస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్. మూర్తి తెలిపారు. బుధవారం ఒక దినపత్రికలో వచ్చిన వార్తకు వివరణ యిస్తూ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ నుండి నెలవారీ కంది పప్పు కోటా అందని కారణముగా రాష్ట్ర వ్యాప్తముగా చౌక ధరల దుకాణముల ద్వారా సరఫరా కావటము లేదన్నారు. ఐనప్పటికీ ఇదివరలో పౌరసరఫరాల శాఖ మాత్యులు కమీషనర్, పౌర సరఫరాల శాఖ మార్కెట్ ధరల (విపణి యందు ధరల) పెంపు పై సమీక్ష జరిపి ప్రజలకు అందుబాటులో గల ప్రదేశములు, ఇంకా బహుళ సముదాయముల వర్తక కేంద్రాలు యందు ప్రత్యేక కేంద్రములు తెరిచి బియ్యము బీపీటీ, సోనామసూరి (స్టీమ్డ్) వెరైటీ కిలో 49 రూపాయలకు, బీపీటీ, సోనామసూరి (పచ్చి), వెరైటీ కిలో 48 రూపాయలకు, కందిపప్పు కిలో 160 రూపాయలకు అమ్మకం జరపాలని నిర్ణయము జరిగిందని, వెంటనే తమ తమ జిల్లాలలో కేంద్రములు ప్రారంభించి సామాన్య ప్రజలకు అందుబాటులో తీసుకుని రావాలని ఆదేశించారన్నారు. ఈ ఆదేశాలననుసరించి జిల్లా వ్యాప్తముగా 58 ప్రత్యేక కేంద్రాలలో బియ్యము, కంది పప్పు పై ధరల ప్రకారము అమ్మకం ప్రారంభించడము జరిగిందని ఆయన తెలియజేసారు. ఒక్కొక్క వినియోగదారుడు కంది పప్పు ఒక్క కెజి, బియ్యము ఐదు కేజీలు ఇవ్వబడును అని, జిల్లా లోని ప్రజలు పై సరుకులు ప్రత్యేక అమ్మక కేంద్రాలనుండి కొనుగోలు చేయవలసినదిగా తెలిపారు. ప్రస్తుతం అనకాపల్లిలో 8, చోడవరంలో 6, సబ్బవరంలో 5, ఎలమంచిలిలో 2, కశింకోటలో 1, రాంబిల్లిలో 1, నర్సీపట్నంలో 5, రోలుగుంటలో 2, నాతవరంలో 1, నక్కపల్లిలో 1, ఎస్.రాయవరంలో 1, పాయకరావు పేటలో 2, కోటఉరట్లలో 2, బుచ్చియ్యపేటలో 2, మాడుగులలో 2, మాకవరపాలెంలో 2, రావికమతం 3, కె.కోటపాడులో 5, దేవరాపల్లిలో 1, చీడికాడలో 1, పరవాడలో 2, అచ్చుతాపురంలో 2 ప్రత్యేక అమ్మక కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందని, ప్రజల అవసరాల కనుగుణముగా కేంద్రములు పెంచడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సిసిటిఎన్ఎస్ లో నిక్షిప్తం చేయాలి

**- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐజి పర్సనల్స్ ఎస్.హరికృష్ణ**

**విజయనగరం పెన్ సత్తా:** జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ లలో పని చేస్తున్న పోలీసు అధికారులతో ఏప్రిల్ 2 న జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మాసాంతర నేర సమీక్షా సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐజీ పర్సనల్స్ ఎస్.హరికృష్ణ, ముఖ్య అతిథిగా హాజరై, సిసిటిఎన్ఎన్ ద్వారా దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసులను సమీక్షించారు. జిల్లాకు విచ్చేసిన ఐజి హరికృష్ణకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత స్వాగతం పలకగా, పోలీసుల నుండి ఐజి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఐజి ఎస్.హరికృష్ణ మాట్లాడుతూ వివిధ పోలీసు స్టేషన్ లలో నమోదవుతున్న కేసుల దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సిసిటిఎన్ఎస్ (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగు నెట్వర్కు అండ్ సిస్టం)లో నిక్షిప్తం చేయాలన్నారు. భవిష్యత్తులో అన్ని రివ్యూ మీటింగులకు సంబంధించిన సమాచారాన్ని సిసిటిఎన్ఎస్ ద్వారానే తీసుకొని, సమీక్షిస్తున్నామన్నారు. కావున, ఎస్ఐలు, సిఐలు, డిఎస్పీలు సిసిటిఎన్ఎస్ పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసుశాఖలో సిసిటిఎన్ఎస్ కు మంచి ప్రాధాన్యత ఉందని, రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ప్రతీ రోజూ వివిధ జిల్లాల్లో నమోదవుతున్న కేసులు, ఆయా కేసుల దర్యాప్తులో సాధించిన పురోభివృద్ధిని పర్యవేక్షిస్తున్నామన్నారు. అనంతరం, వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదైన గ్రేవ్ కేసులను ఐజి హరికృష్ణ సిసిటిఎన్ఎస్ ద్వారా సమీక్షించి, అధికారులకు దిశా నిర్దేశం చేసారు. సిసిటిఎన్ఎస్ వినియోగించుటలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకొని వస్తే, వాటిని సమీక్షించి, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి, ఇబ్బందులను తొలగించేందుకు కృషి చేస్తానని ఐజి హరికృష్ణ తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ పోలీసు స్టేషను పరిధిలో ఏదైనా నేరం నమోదైనపుడు సంబంధిత అధికారులు సంఘటనా స్థలంకు వీలైనంత తక్కువ సమయంలో చేరుకోవాలని, నేర స్థలంను క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేసి, కేసులను ఛేధించేందుకు అవసరమైన సాంకేతిక ఆధారాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. స్టేషను పరిధిలో ఉన్న ప్రముఖులు, దేవుళ్ళ విగ్రహాల పై నిఘా పెట్టాలని, విగ్రహాల పై ఆకతాయిలు దాడులు చేయకుండా స్థానికులతో విగ్రహాల రక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. లేడీస్ హాస్టల్స్ లో భద్రత ఏర్పాట్లును సంబంధిత పోలీసు అధికారులు పర్యవేక్షించాలని, హాస్టలకు ప్రహరీ, సిసి కెమెరాలు, వాచ్మెన్ ఉండే విధంగా యాజమాన్యాలు చర్యలు చేపట్టే విధంగా చూడాలన్నారు. మిస్సింగు కేసుల్లో అలసత్వం వద్దని, ఫిర్యాదు అందిన వెంటనే కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టాలన్నారు. పోలీసు స్టేషన్ లలో వుమెన్ హెల్ప్ డెస్క్ లు, రిసెప్షన్ అధికారులు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ కు వచ్చిన వారితో మర్యాదగా ప్రవర్తించాలని, ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని, వారికి అవసరమైతే ఫిర్యాదు వ్రాయుటలో సహాయ వడాలన్నారు. ఫింగర్ ప్రింట్స్ లైవ్ స్కానర్స్ ను సద్వినియోగం చేసుకోవాలని, అనుమానస్పద వ్యక్తుల వేలిముద్రలను తీసి, వారి నేర చరితను గుర్తించాలన్నారు. హిస్టరీషీట్లు కలిగిన వ్యక్తులు ప్రవర్తన, నడవడిక, నేర ప్రవృత్తిపై నిఘా పెట్టాలని, కౌన్సిలింగు ఇవ్వాలని, వేరే ప్రాంతాల్లో నివసిస్తూ, కౌన్సిలింగుకు హాజరుకాని వ్యక్తుల హిస్టరీ షీట్లును ఆయా పోలీసు స్టేషన్లుకు బదిలీ చేయాలన్నారు. హత్య, రేప్, గంజాయి, రోబరీ, దొంగతనాలు, పోక్సో కేసుల్లో నిందితులు, శిక్షలు పడిన వ్యక్తుల ప్రవర్తనపై నిఘా పెట్టేందుకు వెంటనే వారిపై హిస్టరీ షీట్లును ప్రారంభించాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. మహిళలపై దాడులను నియంత్రించేందుకు ప్రారంభించిన శక్తి టీమ్స్, సంబంధిత పోలీసు అధికారులు తమ పరిధిలోని స్కూల్స్ ఏక్టివ్ గా ఉండే తరగతి విద్యార్థులతో శక్తి వారియర్స్, వారిలో చురుకుగా ఉన్న విద్యార్థినుల తో లీడ్ వారియర్స్ గ్రూపులను ఏర్పాటు చేసి, వారికి మహిళలకు రక్షణగా నిలిచే చట్టాల పట్ల, పోలీసుల సహాయంను పొందేందుకు ఉపయోగపడే అత్యవసర ఫోను నంబర్లు పట్ల అవగాహన కల్పించాలన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఇతర మతాలకు చెందిన ప్రార్ధన స్థలాల్లో తప్పనిసరిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఈ-సాక్ష్య, ఈ-బీట్ యాప్లను రాష్ట్ర పోలీసుశాఖ అందుబాటు లోకి తేనున్నట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. 112 ఫోను కాల్స్ వచ్చే సమయంలో సంఘటన స్థలంకు పోలీసు స్టేషన్లుకు ఇప్పటికే అందించిన ట్యాబ్లను తమ వెంట తీసుకొని వెళ్ళాలన్నారు. గంజాయిని యంత్రణలో భాగంగా వినియోగం, విక్రయం, అమ్మకాలు చేసే వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. వివిధ పోలీసు స్టేషన్లులో నమోదై, దర్యాప్తులో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులు, ఎన్డీపిఎస్, మిస్సింగు, 194 బి.ఎన్.ఎన్. కేసులు, మహిళల పై జరుగుతున్న దాడుల కేసులను, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించి, దర్యాప్తు పెండింగులో ఉండుటకుగల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, దర్యాప్తు పూర్తి చేయుటకు అధికారులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ దిశా నిర్దేశం చేసి, గ్రేవ్ కేసుల్లో 60 రోజుల్లోగా అభియోగ పత్రాలు దాఖలు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. వివిధ పోలీసు విధులను సమర్ధవంతంగా నిర్వహించి, గంజాయి, చోరీలు నియంత్రించుటలోను, లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులను డిస్పోజ్ చేయుట లోను, దర్యాప్తు కేసులను తగ్గించుట లోను, సిసిటిఎన్ఎస్ లో కేసుల వివరాలను సకాలంలో అప్లోడ్ చేయుటలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలను ప్రదానం చేసారు. ఈ నేర సమీక్షా సమావేశంలో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి జి.భవ్య రెడ్డి, చీపురుపల్లి డిఎస్పీ ఎస్. రాఘవులు, డిటిసి డిఎస్పీ ఎం.వీరకుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పలువురు సిఐలు, వివిధ పోలీసు స్టేషనుల్లో ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.








# యువతను ఆదుకోవాలని మంత్రి లోకేష్ ను కోరిన జనసేన రాజు

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 02:** నిరుద్యోగ యువతను ఆదుకోవాలని చోడవరం ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి నారా లోకేష్ ను జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ పి.వి.ఎస్.ఎన్ రాజు కోరారు. నియోజకవర్గంలోని 4 మండలాల్లో నిరుద్యోగ యువకులు ఎక్కువగా ఉన్నారని వారిని ప్రభుత్వపరంగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పరిశ్రమలు ఏర్పాటు చేయడం, స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలకు ప్రోత్సహించడం చేయాలని కోరారు. త్వరలో భారీ జాబ్ మేళా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని లోకేష్ కు తెలిపారు.



# పాలిసెట్-2025 కు ఉచిత శిక్షణ

**అనకాపల్లి,పెన్ సత్తా, ఏప్రిల్ 02:** పాలిసెట్-2025 పరీక్షకు సిద్ధం అవుతున్న విద్యార్ధుల సౌకర్యార్థం ప్రభుత్వ పాలి టెక్నిక్, అనకాపల్లి నందు వుచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు . అత్యంత అనుభవజ్ఞులైన పాలిటెక్నిక్ లెక్చరర్స్ తో ఈ శిక్షణా కార్యక్రమము నిర్వహింపబడుతుందన్నారు. పాలీసెట్ 2025 పరీక్షకు ధరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి ఈ సదావకాశాన్ని వినియోగించు కోవలసిందిగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు సరిచించారు. శిక్షణా తరగతులు తేది.03.04.2025 నుండి ప్రారంభమగునని, శిక్షణ తరగతులు ప్రతీ రోజు ఉదయం 9.30 గంటల నుండి 12.30 గంటల వరకు కళాశాల లోని బ్లాక్-3 నందు నిర్వహించ బడునని, ఆసక్తి కల విద్యార్థులు 9398848767, 8919790483 ఫోన్ నంబర్ లలో సంప్రదించి మిగతా వివరాలు తెలుకోవలసినదిగా తెలియజేసారు.



# సిపిఐ చోడవరం మండల మహాసభ

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 02:** స్థానిక చీడికాడ రోడ్డులో గల శ్రీనూకాంబిక కళ్యాణ మండపంలో సిపిఐ చోడవరం మండల మహాసభ నిర్వహించారు. సిపిఐ చోడవరం డివిజన్ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో జరిపిన మండల మహాసభలో ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ.... బడుగు బలహీన వర్గాల, కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, హక్కుల కోసం పోరాడితే పోయేదేమీ లేదని ఈ బానిస సంకెళ్లు తప్పుతాయని పేర్కొన్నారు. పోరాటంతోనే మన హక్కులు సాధించుకోవచ్చునని లేకుంటే నాయకులు, అధికారులు మనల్ని బానిసల్లా చూస్తారని తెలిపారు. సహాయ కార్యదర్శి రామానాయుడు మాట్లాడుతూ... రైతే రాజని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో పేర్కొన్నారు. రాజాన దొరబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని సూపర్ సిక్స్ అంటూ ముఖ్యమంత్రి మాట్ల గారిడి చేస్తున్నారని విమర్శించారు. సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు, చోడవరం డివిజన్ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ.... రోడ్లు మరమ్మతులు చేయించుకుండా ఆటోలకు కేసులు రాయడం పద్ధతిగా లేదని, అసంఘటిత కార్మికులకు సమగ్రమైన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం 11 మందితో నూతన కార్యవర్గాన్ని నియమించారు. మండల కార్యదర్శిగా సోమాధుల దేవి, సహాయ కార్యదర్శిగా విస్సారపు నాగూర్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కిల్లి లక్ష్మయ్య, ద్వారపూడి నాగేశ్వరరావు, పలువురు కమ్యూనిస్టు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్యకర్తలతో ఆత్మీయ సమావేశంలో రత్నాకర్

**అనకాపల్లి,పెన్ సత్తా ఏప్రిల్ 02:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం ప్రతి బుధవారం కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. బుధవారం 80 వార్డు పరిధిలో గల కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో రత్నాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో దాడి రత్నాకర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కి కార్యకర్తలే ముఖ్యమని వారి శ్రేయస్సు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభ్యత్వం తీసుకున్న ముఖ్య కార్యకర్తకు ఐదు లక్షల రూపాయలు ప్రమాద బీమా చేయించడం జరిగిందని అన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సాధికారత సారధులను ఏర్పాటు చేయనుందని, ప్రతి ఒక్కరికి 30 మంది కుటుంబాల బాధ్యత ఇవ్వనున్నారని తెలియజేశారు. ఈ సారదులలో ప్రతి కార్యకర్తకు ఎన్నిక జరుగుతుందని అన్నారు. దాడి జైవీర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా 4,000 రూపాయలు అందజేసే ఘనత నారా చంద్రబాబు నాయుడు కి దక్కుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కొణతాల నీలిమ భాస్కర్, కొణతాల సత్యనారాయణ, కర్రి దివాకర్, తెలుగుదేశం పార్టీ 80 వ వార్డు ప్రెసిడెంట్ కాండ్రేగుల రాజారావు (రాజు) తెలుగుదేశం పార్టీ 80 వ వార్డు సెక్రటరీ విల్లూరి అప్పల నాయుడు, మల్ల రాజా, కొణతాల రాజేంద్ర, బొడ్డపాటి రాజారావు, వల్లూరు మాజీ సర్పంచ్ ఎర్ర సత్యనారాయణ, రాజుపాలెం గొల్లవెల్లి రామకృష్ణ ప్రసాద్ (బుజ్జి ), గొల్లవెల్లి రవి, కనుమ రెడ్డి గోవిందా, కటారి శ్రీను, (ఇరుకువాని పాలెం) కొల్లవెల్లి నరసింగరావు, కర్రీ శివుడు, బొడ్డేడ శంకర్రావు, కొణతాల బాల నాగేశ్వర రావు, కొణతాల అప్పల నాయుడు, కర్రి శివన్నారాయణ మాజీ కౌన్సిలర్, కర్రీ అప్పాజీ, కోరుబిల్లి ఆరుద్ర, పొలిమేర శివ అప్పారావు, కర్రీ నారాయణ రావు, గోవాడ రాజు, బుద్ధ డి నాయుడు, నాయుడు, దాడి త్రినాథ్, బుద్ధ భువనేశ్వర్రావు,జనపరెడ్డి నర్సింగరావు, కొణతాల రవీంద్ర, బుద్ధ ఈశ్వరరావు, పొలిమేర మణి, కాండ్రేగుల చందు, సూరిశెట్టి వెంకట్రావు, కసిరెడ్డి పెంటారావు, సిహెచ్ వెంకట్రావు, కర్రి శివాజీ, ఎం హరి ప్రసాద్, బొడ్డేడ భువనేశ్వర్ రావ్, పెంటకోట చిన్న, విల్లూరి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.







Anakapalli
03-04-2025
PEN SATTA
Telugu Daily
పెన్ సత్తా
తెలుగు దిన పత్రిక


# క్షయ నివారణపై అవగాహన సదస్సు

**చోడవరం పెన్ సత్తా ఏప్రిల్ 02:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్ యూనిట్లు 1,2,3 మరియు కమిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో కాలేజీ ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.... విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధి లక్షణాలు కనిపించడం వెంటనే మందులు వాడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డి.మల్యాద్రి, డాక్టర్ రత్న భారతి, బి.పిచ్చమ్మ, ఎన్వైకే సభ్యులు వినయ్ కుమార్, ప్రసన్నకుమార్, హెల్త్ సెంటర్ సభ్యులు వి.సత్తిబాబు, ఎం.పుష్ప, వైస్ ప్రిన్సిపల్ ఈవీవీ సత్యవతి, వి.అప్పలనాయుడు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# ఉపాధి హామీ పనులకు భూమి పూజ

**అచ్చుతాపురం పెన్ సత్తా ఏప్రిల్ 02:** అచ్చుతాపురం మండలం ఉప్పవరం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సీనియర్ నాయకులు గ్రామ ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు భూమి పూజ చేసి పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జ్ ఏపీ డివో ఎరకీయ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి సభ్యులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సభ్యులందరినీ కోరారు.



# బార్క్ సమస్యల పై గ్రామస్తులతో ఆర్డిఓ సమావేశం

**అచ్చుతాపురం పెన్ సత్తా ఏప్రిల్ 02:** మండలం లోని దోసూరు పంచాయతీ రాజ్ పాలెం గ్రామంలో బార్క్ సమస్యల పై ఆర్డిఓ షేక్ అయిషా అధ్యక్షతన గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో డి పట్టా ల్యాండ్ లకి నక్క పల్లికి ఇచ్చిన రేటు 60 లక్షల ఇవ్వమని కోరడం జరిగింది, అలాగే గ్రామంలో ప్రతి రేషన్ కార్డు కి ఐదు సెంట్లు భూమిని రైతులు కోరడం జరిగింది.గ్రామములో ఉమ్మడి అవసరాల కోసం పది ఎకరాల భూమి, గ్రామస్తులు వ్యవసాయ భూముల లోకి వెళ్లిపోవడానికి బార్క్ నుంచి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. సి ఎస్ ఆర్ ఫండ్స్ ని నష్టపోతున్న గ్రామాలకి ప్రాధాన్యత ఇవ్వమని గ్రామ పెద్దలు కోరారు. ఈ ల్యాండ్ రేట్లు తేల్చడం కోసం నెగోషియేషన్ కమిటీని ఏర్పాటు చేయమని కోరారు. ఈ సమావేశంలో నర్మల్ రామకృష్ణ, బంటుమిల్లి అప్పారావు, తాతబాబు, లాయర్, రైతులు పాల్గొన్నారు.





# సీతారామ కల్యాణ రాట కార్యక్రమం

**పరవాడ పెన్ సత్తా ఏప్రిల్ 02:** గ్రామంలో శ్రీరామ నవమి వేడుకల మహోత్సవ కార్యక్రమంలో భాగంగా రామాలయం వద్ద కళ్యాణ రాట ఉత్సవంలో ఎంపీపీ పయిల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు పాల్గొని పందిరి రాట వేశారు. అనంతరం రామాలయంలో విశేషమైన పూజలు జరిపి, ప్రజలందరికీ మంచి జరగాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఉదయం నుండి సీతారాముల కల్యాణ మహోత్సవం అంగ రంగ వైభవంగా జరుగుతుంది అని తెలియజేశారు. పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పల నాయుడు దంపతులు నిర్వహణలో సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని, అలాగే మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం, అదేరోజు సాయంత్రం గ్రామ పురవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య కోలాటం తో స్వామివారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో భక్తులు అందరూ పాల్గొని సీతారాముల కృపకటాక్ష విక్షణాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, ఉపసర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస రావు, టిడిపి అధికార ప్రతినిధి పయిల రామచంద్ర రావు, వార్డు మెంబర్ గండి ఈశ్వర రావు, పయిల అప్పల నాయుడు సత్యవేణి, సిరపరపు అయ్యబాబు, పయిల అప్పారావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఆకతాయిల ఆట కట్టించేందుకు ప్రత్యేకంగా శక్తి టీమ్స్ జిల్లా ఎస్పీ

**- ఆరుగురు సభ్యులతో ఐదు బృందాలుగా 30 మందితో శక్తి టీమ్స్ ఏర్పాటు.**

**అనకాపల్లి, పెన్ సత్తా, ఏప్రిల్ 02:** జిల్లాలో మహిళల పై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు రక్షణంగా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకంగా శక్తి టీమ్స్ ను నియమించామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శక్తి టీమ్స్ నిర్వర్తించే విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాల పై దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల పట్ల ఎటువంటి దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకు గాను ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శక్తి టీమ్స్ ను జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్ళను (హాట్ స్పాట్స్ ను) మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయి లను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడతరన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం పట్టణాలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో, ఐదు బృందాలుగా, మొత్తం 30 మందితో శక్తి టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఒక్కొక్క బృందానికి ఎస్సై నాయకత్వం వహిస్తారన్నారు. ఈ బృందాలు మఫ్టీ లో విధులు నిర్వహిస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఆపద సమయంలో శక్తి యాప్ కు వచ్చే ఎస్.ఓ.ఎస్.కాల్స్, డయల్ 112/100 కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలంకు చేరుకొని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శక్తి టీమ్స్ ను ఆదేశించారు.

మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి, వారి మొబైల్స్ లో యాప్ నిక్షిప్తం చేయడం, రిజిస్ట్రేషను చేయాలన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని విద్యార్థిని లకు, మహిళలకు వివరించాలన్నారు. ఈ బృందాల పని తీరును జిల్లాలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ పర్యవేక్షిస్తారని, మహిళా పి.ఎన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు నోడల్ అధికారిగా ఉంటారన్నారు. అంతేకాకుండా, శక్తి టీమ్స్ ను రాష్ట్ర డిజిపి కార్యాలయం కూడా పర్యవేక్షిస్తుందని, వారి ఆదేశాల మేరకు పని చేయాల్సి ఉంటుందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శక్తి టీమ్స్ కు దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ ఎం.దేవ ప్రసాద్, మహిళా పి.ఎస్ డీఎస్పీ శ్రీ ఇ.శ్రీనివాసులు, సి.ఐ చంద్రశేఖర్, ఎస్సై మనోజ్ కుమార్, శక్తి టీమ్స్ సభ్యులు పాల్గొన్నారు.





# టీడీపీ తోనే యాదవుల ఉన్నతి, మంత్రి ఎస్.సవిత








**విజయవాడ పెన్ సత్తా ఏప్రిల్ 02 :** టీడీపీ తోనే యాదవుల ఉన్నతి సాధ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. యాదవులను వ్యాపారులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నర్సింహాయాదవ్ సహా డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కింజరపు అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధితో కలిసి మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. యాదవులకు రాజకీయంగా, ఆర్థికంగా టీడీపీ ప్రభుత్వం తోనే సాధ్యమని మంత్రి సవిత తెలిపారు. ప్రస్తుత కేబినెట్ లో 8 మంది బీసీలను మంత్రులుగా సీఎం చంద్రబాబు అవకాశమిచ్చారన్నారు. వారిలో సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి యాదవ సామాజిక వర్గానికే చెందినవారన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను పల్లా శ్రీనివాస యాదవ్ కు అప్పగించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగానూ యాదవ సామాజిక వర్గానికి చెందిన విజయానంద్ ను నియమించారన్నారు. యాదవులకు గొర్రెలు, మేకలు, గోవుల యూనిట్లు అందజేయడానికి స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. యాదవులను వ్యాపారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు ప్రణాళికలు రూపొందించారన్నారు. ఊరిలోనే ఉండి పశువుల మేత ఆర్థికంగా లబ్ధి కలిగేలా పశుగ్రాసం సాగుతో పాటు పశువుల దాణా కూడా అందజేసేలా చర్యలు తీసుంటున్నట్లు మంత్రి సవిత వివరించారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల నారాయణరావు, వీరంకి గురుమూర్తి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ కూటమి నాయకులు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన యాదవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రామగిరి మండలంలో ఇప్పటివరకు ఫ్యాక్షన్ హత్యలు లేవు

**- అనుకోకుండా జరిగిన సంఘటనను ఫ్యాక్షన్ గా చిత్రీకరిస్తున్నారు.**

**- తోపుదుర్తి పై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం.**

**అనంతపురం పెన్ సత్తా ఏప్రిల్ 02:** అనంతపురం లో శాసనసభ్యురాలు పరిటాల సునీత ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సునీత మాట్లాడుతూ రామగిరి మండలంలో ఇప్పటివరకు ఎక్కడా ఫ్యాక్షన్ హత్యలు జరగలేదని, అనుకోకుండా జరిగిన ఒక సంఘటనను ఫ్యాక్షన్ హత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం నగరం లోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్-కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 40 అర్జీలు రాగా వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇందులో ముఖ్యంగా భూ సమస్యలు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, ఉద్యోగుల సమస్యలు, ఫించన్లు, రోడ్డు సౌకర్యం, మన్నీల ఎస్సీ కాలనీలో త్రాగునీటి కోసం బోరు వంటి అంశాల గురించి అర్జీలు వచ్చాయి. వీటన్నింటినీ త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సునీత హామీ ఇచ్చారు. గ్రామంలో నాయకులు ప్రజా సమస్యలకు పరిష్కారం చూపడంలో చొరవ తీసుకోవాలన్నారు. మీ ప్రాంతంలో ఉన్న సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా వాటిని పరిష్కరిస్తామన్నారు. ప్రజల ఇబ్బందులను ఎప్పటికప్పుడు అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. అలాగే కుటుంబ సాధికార సారధిలో ప్రతి ఒక్కరు ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో 83 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేసి, జిల్లాలో రెండవ స్థానంలో నిలిచినట్టు చెప్పారు. ఇప్పటికే 73 వేల సభ్యత్వాల కార్డులు వచ్చాయని, వాటిని శ్రీరామనవమి లోపుగా అందరికీ అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు అంజనప్ప నుంచి ఎమ్మెల్యే సునీత సభ్యత్వం కార్డును తీసుకున్నారు. ఇప్పటివరకు ఎనిమిది మంది మరణించగా వారికి ఇన్సూరెన్స్ వచ్చిందని తెలియజేశారు. త్వరలో కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు వస్తాయని, గత వైసిపి ప్రభుత్వం తొలగించిన వాటిని పునరుద్ధరిస్తామని ఆమె స్పష్టం చేశారు. మరోవైపు ఎనిమిది మంది ఎంపీటీసీలు ఉండి కూడా ఎంపీపీ గెలుచు కోలేని దద్దమ్మ ప్రకాష్ రెడ్డి అంటూ ఎమ్మెల్యే సునీత అన్నారు. మీ పార్టీ వారు మీ వైపు ఉంటే ఎందుకు వారిని క్యాంపులకు తరలించారో చెప్పాలన్నారు. రాప్తాడు నియోజకవర్గం వైసీపీ లోకి మరో నేత వచ్చాడు అన్న కంగారుతో జగన్ రెడ్డి దృష్టిలో పడాలనే ఉద్దేశంతో లేనిపోని రచ్చ చేస్తున్నాడంటూ ప్రకాష్ రెడ్డి పై మండిపడ్డారు. మాకు ఎంపీపీ గెలవాలన్న ఉద్దేశం ఉండి ఉంటే నువ్వు ఆపలేవన్నారు. ఎన్నికల సమయం లోనే తమను పోటీ చేయవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని, లేని పక్షంలో 6 మండలాల్లో ఎంపీపీలు మా పార్టీ వారే ఉండేవారని సునీత స్పష్టం చేశారు. పాపిరెడ్డిపల్లిలో జరిగిన సంఘటన అనుకోకుండా జరిగిందని, అయితే అది ఫ్యాక్షన్ హత్యగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. అసలు రామగిరి మండలంలో ఫ్యాక్షన్ అన్నదే లేదన్నారు. లింగమయ్య ఇంటి పేరును మార్చి కురుబ లింగమయ్య అంటూ కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు మాపై ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని, వారి సమస్యల పరిష్కారంలో తాము బిజీగా ఉన్నామన్నారు. మేము అనుకుంటే నియోజకవర్గం లోనే కాదు జిల్లాలో కూడా అడుగు పెట్టలేవని ఎమ్మెల్యే సునీత హెచ్చరించారు.






# ప్రజలు మనల్ని నమ్మి ఓట్లు వేశారు వారి సమస్యల పై దృష్టి పెట్టండి

**- పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుంది.**

**- అధికారంలో ఉన్నప్పుడు మన పై ఇంకా ఎక్కువ బాధ్యత ఉంటుంది.**

**- పార్టీ శ్రేణులకు పరిటాల శ్రీరామ్ దిశా నిర్దేశం.**

**ధర్మవరం పెన్ సత్తా ఏప్రిల్ 02:** ధర్మవరంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యకర్తల, ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ముఖ్య అతిధిగా నియోజకవర్గం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్, హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు అంజినప్ప పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రూ.7.68 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పరిటాల శ్రీరామ్ పంపిణీ చేశారు. ప్రజలు మా కంటే ఎక్కువగా స్థానిక నాయకులైన మిమ్మల్ని నమ్మి ఓట్లు వేశారని, వారి సమస్యలు తీర్చే బాధ్యత కూడా మన పై ఉంటుందని ధర్మవరం కార్యకర్తలను ఉద్దేశించి శ్రీరామ్ అన్నారు. ధర్మవరం టిడిపి కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ తో పాటు హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు అంజినప్ప పాల్గొన్నారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు, కార్యకర్తలు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యల గురించి శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటినీ కచ్చితంగా పరిష్కరించే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం లోకి వచ్చి 9 నెలలు గడిచిందని, ఇక నుంచి మనం క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటి కంటే అధికారంలో ఉన్నప్పుడే మన పై బాధ్యత ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు మీపై నమ్మకంతో ఓట్లు వేశారని, ఏదైనా సమస్య వస్తే పరిష్కరిస్తారనే నమ్మకం వారికి ఉంటుందని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా మనం పని చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. పార్టీలో పదవులు ఇతర పనులు జరగడం లేదన్న ఆవేదన కొంతమందికి ఉందన్నారు. అయితే అధికార పార్టీలో ఉన్నప్పుడు మనకు కొన్ని పరిమితులు ఉంటాయని కార్యకర్తలు వాటిని అర్థం చేసుకోవాలన్నారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని, ఇంకా నాలుగేళ్ల సమయం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో ఎక్కువమందికి పదవులు వస్తే, అది ప్రజలకు మంచి చేయడానికి ఉపయోగ పడుతుందన్నారు. ఇకనుంచి ప్రతి ఒక్కరు తమ వార్డు, గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లాలన్నారు. వారి సమస్యలను సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని పరిటాల శ్రీరామ్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం 12 మందికి రూ.7.68 సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన శ్రీరామ్. ధర్మవరం నియోజకవర్గంలో వివిధ కారణాలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 12 మందికి 7 లక్షల 68 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ధర్మవరం పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు ఈ చెక్కులను అందించగా, లబ్ధిదారులు శ్రీరామ్ తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముదిగబ్బ మండలంలో ముగ్గురికి, ధర్మవరం పట్టణం లోని 5 మందికి, ధర్మవరం మండలం లోని నలుగురికి ఈ సాయం అందింది. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆరోగ్యం విషయంలో ఖర్చులు చూడటం లేదన్నారు. సీఎంఆర్ఎఫ్ కింద సాయం అడిగిన వెంటనే స్పందిస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆలోచిస్తున్న ప్రభుత్వం ఇది అని శ్రీరామ్ అన్నారు.





# వంట మనిషికి రూ.కోటి ఇచ్చి తన ఉదారతను చాటిన టాటా

**పెన్ సత్తా డెస్క్:** పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా వీలునామా గురించి మరిన్ని విషయాలు వెలుగు లోకి వచ్చాయి. తనకు ఎప్పటి నుంచో వంట వండిపెడుతున్న కుక్ రజన్ షాకు ఆయన రూ. కోటి ఇచ్చారు. అందులో రూ. 51 లక్షల రుణ మాఫీ కూడా ఉంది. ఇంటి పనులు చేసే సుబ్బయ్యకు రూ.66 లక్షలు, సెక్రటరీ డెల్నాజుకు రూ.18 లక్షలు రుణం మాఫీ చేశారు. తన ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ శంతను నాయుడు కు ఎంబీఏ కోసం పొడిగించిన రూ.కోటి రుణాన్ని రతన్ టాటా మాఫీ చేశారు. పార్ట్ టైమ్ హెల్పర్లు, కార్ క్లీనర్లకు రూ. లక్ష పంపిణీ చేయాలని కూడా ఆయన వీలునామాలో నిర్దేశిస్తున్నారు. రతన్ టాటా తన దుస్తులను ఎన్ జి ఓ లకు విరాళంగా ఇవ్వాలని టాటా 2022 ఫిబ్రవరి 23 నాటి తన వీలునామాలో పేర్కొన్నారు. తద్వారా వాటిని పేదలకు పంపిణీ చేయవచ్చు. బ్రూక్స్ బ్రదర్ షర్టులు, హెర్మ్స్ టైలు, పోలో, డాక్స్, బ్రియోని సూట్లు వంటి బ్రాండ్లను రతన్ టాటా ధరించేవారు. రతన్ టాటా పెంపుడు జంతువు టిటో గురించి వీలునామాలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. జర్మన్ షెపర్డ్ కోసం ఆయన రూ. 12 లక్షలు కేటాయించారు. ప్రతి త్రైమాసికానికి రూ.30వేల చొప్పున వాటికి ఖర్చే చేసేలా నిధులను ఇవ్వాలని తన వీలునామాలో రాశారు. బాంబే హైకోర్టులో పిటిషన్లు. అటు తన సవతి సోదరీ మణులు అయిన శిరీన్ జజీభోయ్, దియానా జజీభోయ్ పేరు మీద రూ.800 కోట్లు రాశారు రతన్ టాటా. ఇందులో ఫిక్స్డ్ డిపాజిట్లు, స్టాక్స్ తో పాటు ఖరీదైన వాచ్లు, పెయింటింగ్స్ వంటి విలువైన వస్తువులున్నాయి. ఇక టాటా గ్రూప్ మాజీ ఉద్యోగి, రతన్ కి అత్యంత సన్నిహితుడైన మోహిన్ ఎం దత్తాకు కూడా ఏకంగా రూ.800 కోట్ల విలువైన ఆస్తులు రాసిచ్చారు. కాగా రతన్ టాటాకు రూ.10 వేల కోట్ల ఆస్తులుండగా, రూ.3,800 కోట్లను దానధర్మాలకు ఇచ్చేశారు. 2022 ఫిబ్రవరి 23 న రాసిన ఈ వీలునామా ప్రకారం ఆస్తుల కేటాయింపు జరగాల్సి ఉంటుంది. ఇప్పటికే దీని పై బాంబే హైకోర్టులో పిటిషన్లు ధాఖలైంది. ఇదంతా పూర్తయ్యేసరికి మరో ఆరు నెలలు పడుతుంది.



# మార్కెట్లలో టారీఫ్‌ల అల్లకల్లోలం



దలాల్ స్ట్రీట్‌లో అమెరికా ప్రతీకార సుంకాల భయాలు అల్లకల్లోలం సృష్టించాయి. ఈ దెబ్బతో ఆర్ధిక సంవత్సరం 2025-26 తొలి రోజు మంగళవారం ఒక్క పూటలోనే రూ.3.44 లక్షల కోట్ల మదుపర్ల సంపద హరించుకుపోయింది. ట్రంప్ నిర్ణయాలు ముఖ్యంగా ఐటి కంపెనీల ఆదాయాలపై ప్రతికూల ప్రభావం చూపనున్నాయనే అంచనాలు ఆ రంగం షేర్లను కుప్పకూలేలా చేశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన బిఎస్ఇ సెన్సెక్స్ తుదకు 1,390 పాయింట్లు లేదా 1.80 శాతం పతనమై 76,024కు పడిపోయింది. సెన్సెక్స్ 76,882.58 పాయింట్ల నష్టం వద్ద ప్రారంభం కాగా.. ఓ దశలో 75,912 కనిష్టాన్ని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ-50 సూచీ 353.65 పాయింట్లు లేదా 1.5 శాతం కోల్పోయి 23,166కు దిగజారింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.3.44 లక్షల కోట్లు ఆవిరి.. రూ.409 లక్షల కోట్లకు పడిపోయింది. మరోవైపు చమురు ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీవల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి చేరింది. భారత్ చమురు దిగుమతి ప్రధాన దేశంగా ఉండటంతో ధరల పెరుగుదల మార్కెట్లపై విశ్వాసాన్ని దెబ్బతీశాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాలను చవి చూశాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్ షేర్లు అధికంగా నష్టాపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. విఐలో కేంద్రం తన వాటాను 22.6 శాతం నుంచి 49 శాతానికి పెంచకునేందుకు అంగీకరించడంతో ఆ టెలికాం కంపెనీ షేర్లు 20 శాతం మేర లాభపడ్డాయి. ఎన్ఎస్ఇలో 20.15 శాతం ఎగిసి రూ.8.17 వద్ద ముగిసింది.

# జియో పట్ల బిఎస్ఎన్ఎల్ ఉదారతతో రూ.1,757 కోట్ల నష్టం




న్యూ ఢిల్లీ : రిలయన్స్ జియో పట్ల ప్రభుత్వ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్ ఉదారత చూపడంతో కేంద్రానికి రూ.1,757 కోట్ల నష్టం వాటిల్లింది. మౌలిక సదుపాయాల భాగస్వామ్యం పై ఒప్పందం ప్రకారం ప్రభుత్వ యాజమాన్యం లోని టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్ రిలయన్స్ జియోకు బిల్లులు ఇవ్వడంలో విఫలమవడంతో ఈ నష్టం వాటిల్లినట్లు కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ ) మంగళవారం ప్రకటించింది. 2014 నుండి 10 ఏళ్లపాటు బిల్లులు విధించలేదని దీంతో ప్రభుత్వం రూ.1,757 కోట్ల నష్టాన్ని చవిచూసినట్లు తెలిపింది. టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్లు (టిఐపి)లు చెల్లించిన ఆదాయ వాటా నుండి లైసెన్స్ ఫీజు వాటాను తగ్గిచడంలో బిఎస్ఎన్ఎల్ విఫలమైనందున రూ.38.36 కోట్ల నష్టం వాటిల్లిందని కాగ్ మరో ప్రకటనలో తెలిపింది. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్ (ఆర్‌జెఐఎల్) మాస్టర్ సర్వీస్ అగ్రిమెంట్ (ఎంఎస్ఎ)ను అమలు చేయడంలో బిఎస్ఎన్ఎల్ విఫలమైందని, బిఎస్ఎన్ఎల్ షేర్డ్ పాస్‌వర్డ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌లో ఉపయోగించిన అదనపు టెక్నాజలీకి బిల్లు వేయలేదని, ఫలితంగా 2014 మే నుండి 2024 మార్చి వరకు ప్రభుత్వ ఖజానాకు రూ.1.756.76 కోట్ల నష్టం, దానిపై జరిమానా వడ్డీ ఏర్పడినట్లు కాగ్ పేర్కొంది. బిఎస్ఎన్ఎల్ మౌలిక సదుపాయాల భాగస్వామ్య ఛార్జీలో తక్కువ బిల్లింగ్ ఉన్నట్లు కూడా కాగ్ గుర్తించింది. ఆర్‌జెఐఎల్‌తో ఎంఎస్ఎలో బిఎస్ఎన్ఎల్ నిర్దేశించిన నిబంధనలు మరియు షరతులను పాటించకపోవడం, క్రమంగా పెంచాలన్న నిబంధనను వర్తింపచేయకపోవడంతో మౌలికసదుపాయాల భాగస్వామ్య ఛార్జీల నుండి రూ. 29 కోట్ల (జిఎస్‌టితో సహా) ఆదాయం కోల్పోయిందని ఆప్రకటనలో పేర్కొంది.

# గాల్లో ఎగిరే ట్యాక్సీలు వచ్చేశాయ్.. ప్రత్యేకతలు తెలిస్తే మైండ్ బ్లాంక్




గాల్లో తేలిపోయే టెక్నాలజీ వచ్చేసింది. హాయిగా..హుషారుగా గాల్లో చక్కర్లు కొట్టే వండర్ ఫుల్ ఫీల్‌ను సొంతం చేసుకోవాలనుకుంటే చలో చైనా అనాల్సిందే. ఇలా గాల్లో ఎగిరే ట్యాక్సీలకు చైనా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఎస్..చైనాలో పైలట్ అవసరంలేని ఫ్లయింగ్ ట్యాక్సీలను అందుబాటులోకి తెస్తున్నారు . అక్కడి సివిల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అందుకు అనుమతిని కూడా ఇచ్చేసింది . ఆకాశ వీధిలో ఎంచక్కా చక్కర్లు కొడుతోన్ ఎగిరే ట్యాక్సీల వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరలవుతుంది.మామా ..ఇట్టాంటి ట్యాక్సీలు మన దగ్గర ఎప్పటికి వస్తాయంటూ కామెంట్ల మోత కూడా మోగుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 6జీ నెట్‌వర్క్ , క్వాంటమ్ కంప్యూటింగ్, వంటి వాటితో పాటు తక్కువ ఎత్తులో ఎగిరే డ్రోన్లు, బ్లింప్స్.. ఫ్లయింగ్ కార్లను ప్రమోట్ చేస్తోంది చైనా . ఈహ్యాంగ్ హోల్డింగ్స్, హెఫీ హే రెండు ఎయిర్ లైన్ సంస్థలు ఫ్లయింగ్ ట్యాక్స్ పర్మిషన్ దక్కించుకున్నాయి. అర్బన్ ఏరియాల్లో , టూరిస్ట్ స్పాట్లలో ఫ్లయింగ్ ట్యాక్సీల సందడి అల్రెడీ మొదలైంది. స్థానికులే కాదు విదేశీయులు కూడా ఫ్లయింగ్ ట్యాక్సీలను చూసి ఫిదా అవుతున్నారు. గమ్మత్తుగా వుందని గాల్లో తేలిపోతున్నారు. గాల్లో ఎగిరే వాళ్లకు ఆనందం. ఫ్లయింగ్ ట్యాక్సీ ఆపరేటర్లకు ఆదాయమే ఆదాయం. ఆదిలోనే క్రేజ్ అదిరిపోతుంది. ఫ్లయింగ్‌ట్యాక్స్ ప్రాజెక్ట్‌తో దండిగా రాబడి పెంచుకునేలా ప్రమోషన్ పై ఫోకస్ పెట్టింది చైనా. గాల్లో ఎగిరే ఈ ఫ్లయిట్లను చూసి అబ్బురపడిన అరబ్బులు అల్రెడీ బారీగా ఆర్డర్లు ఇచ్చారనేది టాక్.

# పెరిగిన 900 రకాల మందుల ధరలు



దేశంలో 900 రకాల ఔషధ ధరలు తాజాగా పెరిగాయి. వీటిలో యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, గుండె జబ్బులు, మధుమేహానికి సంబంధించిన అత్యవసర మందులున్నాయి. పెంచిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చాయని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) వెల్లడించింది. 2023తో పోల్చితే 2024లో నమోదైన టోకు ద్రవ్యోల్బణం సూచీ ఆధారంగా ఔషధ ధరలను గరిష్టంగా 1.74 శాతం పెంచినట్లు ఎన్‌పిపిఎ వెల్లడించింది. యాంటిబయాటిక్ అజిత్రోమైసిన్ 250 ఎంజి ఒక్కో టాబ్లెట్ ధర రూ.11.87, 500ఎంజి ధర రూ.23.97కు పెరిగింది. అమోక్సిసిలిన్, క్లావులానిక్ యాసిడ్ కలిగిన యాంటీబయాటిక్ డ్రై సిరప్ ధర ఒక్కో ఎంఎల్ గరిష్ఠ ధరను రూ.2.09గా నిర్ణయించారు. పెయిన్ కిల్లర్ డైక్లోఫెనార్ టాబ్లెట్ గరిష్ఠ ధర రూ.2.09కు, ఇబుప్రోఫెన్ 200ఎంజి ఒక టాబ్లెట్ ధర రూ.0.72 కాగా.. 400ఎంజి టాబ్లెట్ ధర రూ.1.22కు పెరిగింది. దయాబెటిస్‌కు వాడే డపాగ్లిఫ్లోజిన్ ప్లస్ మెట్‌ఫార్మిన్ హైడ్రోక్లోరైడ్ ప్లస్ గ్లిమెపిరైడ్ ఒక టాబ్లెట్ ధర రూ.12.74కు చేరింది.


# ఆటో పరిశ్రమకు గుడ్‌న్యూస్.. కీలక నిర్ణయం దిశగా భారత్..!



భారతదేశం- అమెరికా మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి కీలక నిర్ణయం తీసుకోవచ్చు. అమెరికన్ ఆటో విడిభాగాల దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం గురించి భారత ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రస్తుతం వీటిపై 10 శాతం నుండి 15 శాతం వరకు కస్టమ్స్ సుంకం విధిస్తున్నారు. దీని సగటు రేటు 11 శాతం. అమెరికా ఆటో విడిభాగాల ధర ఎక్కువగా ఉండటం వల్ల వాటిపై సుంకాలను తొలగించినప్పటికీ, భారత మార్కెట్లో దేశీయ పరిశ్రమకు ఎటువంటి హాని జరగదని ప్రభుత్వం విశ్వసిస్తోంది. ఇటీవల భారతదేశం - అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం గురించి చర్చ జరిగింది. దీనిలో ఆటోమొబైల్స్ కంటే ఆటో విడిభాగాలపై ఎక్కువ దృష్టి పెట్టారు. ఎకనామిక్ టైమ్స్ నివేదిక, ప్రభుత్వం అధికారులు తెలిపిన ప్రకారం.. భారతదేశం అమెరికా నుండి పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకోని ఉత్పత్తులపై సుంకాలను తగ్గించే విషయాన్ని కూడా పరిశీలిస్తోంది. అమెరికాతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో ఈ అడుగు వేస్తున్నారు. భారతదేశం ప్రతి సంవత్సరం దాదాపు 7 బిలియన్ డాలర్ల విలువైన ఆటో విడిభాగాలను అమెరికాకు ఎగుమతి చేస్తుంది. ఇది మొత్తం ఎగుమతుల్లో మూడో వంతు. అదే సమయంలో భారతదేశం అమెరికా నుండి వి1.5 బిలియన్ల విలువైన ఆటో విడిభాగాలను దిగుమతి చేసుకుంటుంది. ఇటువంటి పరిస్థితిలో భారతదేశం దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే, అది వాణిజ్య సంబంధాలను మరింత సమతుల్యం చేయగలదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం ఆటో విడిభాగాల దిగుమతి సుంకం ప్రణాళిక ప్రభావాన్ని భారత ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ అంశంపై గత వారం న్యూఢిల్లీలో రెండు దేశాల అధికారులు సమావేశమయ్యారు. అక్కడ వాణిజ్య ఒప్పందానికి సంబంధించి మరింత వ్యూహంపై అంగీకారం కుదిరింది. దీని కింద రాబోయే వారాల్లో ఒక రౌండ్ వర్చువల్ సమావేశాలు ప్రారంభమవుతాయి. మొదటి దశను 2025 చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ప్రోటీన్ తక్కువైతే శరీరానికి ఎలాంటి సమస్యలు వస్తాయి!

ప్రోటీన్ మన శరీరానికి అత్యవసరమైన పోషక పదార్థం. ఇది కండరాల పెరుగుదల, శక్తి ఉత్పత్తి, రోగనిరోధక వ్యవస్థను బలంగా ఉంచేందుకు సహాయపడుతుంది. ప్రోటీన్ తక్కువగా ఉంటే అలసట, జుట్టు రాలడం, చర్మ సమస్యలు, కండరాల బలహీనత వంటి సమస్యలు వస్తాయి. సరైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఈ లోపాన్ని తగ్గించుకోవచ్చు. ప్రోటీన్ మన శరీరానికి అత్యంత అవసరమైన పోషక పదార్థాలలో ఒకటి. ఇది కండరాల నిర్మాణానికి, శక్తిని అందించడానికి, ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడుతుంది. శరీరంలో ప్రోటీన్ తక్కువగా ఉంటే అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఇప్పుడు ప్రోటీన్ లోపం వల్ల కలిగే ప్రధాన సమస్యల గురించి తెలుసుకుందాం. ప్రోటీన్ తక్కువగా ఉన్నప్పుడు శరీరానికి తగిన శక్తి అందదు. దీని కారణంగా రోజంతా నీరసంగా అనిపించవచ్చు. చిన్న చిన్న పనులు చేసినా త్వరగా అలసిపోతారు. ముఖ్యంగా శారీరక శ్రమ ఎక్కువగా చేసే వారికి ప్రోటీన్ లోపం వల్ల తక్కువ శక్తి అందుతుందని గుర్తించవచ్చు. ప్రోటీన్ శరీర కణాల నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఇది తక్కువగా ఉంటే జుట్టు రాలిపోవడం జరుగుతుంది. అలాగే చర్మం మృదువుగా కాక పొడిబారినట్లు అనిపించవచ్చు. చర్మంలో ఉత్పత్తి అయ్యే కొలాజన్ స్థాయి తగ్గిపోవడం వల్ల చర్మం మెరుపును కోల్పోయి ఆరోగ్యంగా కనిపించదు. ప్రోటీన్ లోపం వల్ల గోళ్ల ఆరోగ్యంపైనా ప్రభావం పడుతుంది. గోళ్లు సులభంగా విరిగిపోతాయి. కొందరికి గోళ్లపై చిన్న చిట్లింపులు, నరుగు, లేదా అసమాన పెరుగుదల కనిపించొచ్చు. కండరాల పెరుగుదలకు ప్రోటీన్ అనేది చాలా ముఖ్యమైన పోషక పదార్థం. ప్రోటీన్ తక్కువగా ఉన్నప్పుడు కండరాలు బలహీనమై నొప్పులు పెరుగుతాయి. శరీర దృఢత తగ్గిపోవడం వల్ల మామూలుగా ఉండే పనులు కూడా కష్టంగా అనిపించవచ్చు. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ కండరాల నష్టం ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. శరీరంలో గాయాలు త్వరగా మానడానికి ప్రోటీన్ అవసరం. ప్రోటీన్ తక్కువగా ఉంటే కణాలు త్వరగా పునరుద్ధరించబడవు. చిన్న గాయాలు కూడా త్వరగా మానకుండా ఎక్కువ రోజులు పట్టొచ్చు. ప్రోటీన్ రోగనిరోధక వ్యవస్థను బలంగా ఉంచేందుకు సహాయపడుతుంది.



# అందరి చూపూ ట్రంప్ వైపే

వాషింగ్టన్ : తమ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తున్న దేశాల పైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధం కీలక దశకు చేరుకుంది. ఇప్పుడు అందరి దృష్టీ ఆయన పైనే నిలిచి ఉంది. ఎందుకంటే ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాల విధింపు నేటి నుండే అమలులోకి రాబోతోంది. దీనిని ఆయన విమోచన దినోత్సవంగా అభివర్ణించారు. అమెరికా ఉత్పత్తులపై విదేశీ వాణిజ్య భాగస్వాములు ఎంత మేర సుంకాలు విధిస్తారో తాము కూడా వారి ఉత్పత్తులపై ఆ స్థాయిలోనే దిగుమతి సుంకాలు విధిస్తామని, కాబట్టి ఇక తాము విదేశీ వస్తువులపై ఎంతమాత్రం ఆధారపడాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. అయితే ఏయే దేశాలపై ఏ మేరకు సుంకాలు విధిస్తారో ఇంకా తెలియడం లేదు. సుంకాల విధింపునకు గడువు సమీపిస్తున్న తరుణంలో అమెరికా వాణిజ్య ప్రతినిధులు, వాణిజ్య శాఖ, ట్రెజరీ శాఖ నుండి కీలకమైన మూడు నివేదికలు అందాయి. అమెరికాకు 20 దేశాలతో వాణిజ్య ఒప్పందాలు ఉన్నాయి. ప్రారంభంలో ఈ దేశాలే లక్ష్యంగా సుంకాల దాడి జరగవచ్చునని చెబుతున్నారు. వాస్తవానికి అమెరికాకు 200 వాణిజ్య భాగస్వామ్య దేశాలు, సుమారు 12,500 సుంకాల కేటగిరీలు ఉన్నాయి. కాబట్టి కొన్ని లక్షల టారిఫ్‌లు విధించాల్సి వస్తుంది. అయితే అమెరికా అధికారులకు అదంత సులభమైన పనేమీ కాదు. ఒకేసారి అన్ని ఉత్పత్తులు, అన్ని దేశాలపై సుంకాలు విధించడం సమస్యాత్మకం అవుతుంది. అధ్యక్షుడు తన అత్యవసర అధికారాలను ప్రయోగించి సుంకాలను పెంచుతారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. బుధవారమే సుంకాల విధింపును పూర్తి చేస్తారా అన్న ప్రశ్నకు 'ప్రతీకార సుంకాల విధింపు ప్రకటన అనేది తదుపరి చర్చలకు అవకాశం కల్పిస్తుంది. సంప్రదింపులు ఫలిస్తే వాటిని తొలగించవచ్చు లేదా తగ్గించవచ్చు' అని విశ్లేషకులు బదులిచ్చారు.



8
PEN SATTA
Telugu Daily
పెన్ సత్తా
తెలుగు దిన పత్రిక
Anakapalli
03-04-2025

# బ్యాట్ మ్యాన్ మరణం



హాలీవుడ్ :టాప్ గన్, బ్యాట్‌మ్యాన్ ఫరెవర్, ది డోర్స్ చిత్రాలలో తన పాత్రలకు ప్రసిద్ధి చెందిన హాలీవుడ్ స్టార్ వాల్ కిల్మర్ (65) మరణించారు. ఈ వార్తను అతని కుమార్తె మెర్సిడెస్ కిల్మర్ ది న్యూయార్క్ టైమ్స్ ద్వారా ధృవీకరించారు. 2014 లో గొంతు క్యాన్సర్ నిర్ధారణ తర్వాత అనేక సంవత్సరాల పాటు ఆరోగ్య సమస్యల తర్వాత అతను న్యుమోనియాతో మరణించాడని పేర్కొన్నారు. 1980 ల నాటి అనేక చిత్రాలలో నటించిన ఆయనకు 1986 నాటి టాప్ గన్ మంచి నటుడుగా గుర్తింపు నిచ్చింది. 1995 లో బాబ్ కేన్, బిల్ ఫింగర్ రూపొందించిన డిసి కామిక్స్ క్యారెక్టర్ బ్యాట్‌మ్యాన్ ఆధారంగా రూపొందించబడిన చిత్రంతో బ్యాట్ మ్యాన్ ఫరెవర్ తో ప్రేక్షకుల మదిలో నిలిచిపోయాడు.

# మిరాయ్ మెరుపుల్లో దగ్గుబాటి రానా



హనుమాన్ తర్వాత గ్యాప్ వస్తున్నా సరే తదేక దృష్టితో తేజ సజ్జ చేస్తున్న సినిమా మిరాయ్. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియాడిక్ ఫాంటసీ డ్రామా ఆగస్టు 1న రిలీజ్ అవుతుంది. ఇందులో మంచు మనోజ్ విలన్ గా చేయడం అంచనాలు ఆల్రెడీ పెంచేసింది. దీనికి సంబంధించిన టీజర్ గతంలో వచ్చి ఫ్యాన్స్ మెప్పు పొందింది. తాజాగా దగ్గుబాటి రానా ఈ క్రేజీ క్యాస్టింగ్ లో భాగమైనట్టుగా లేటెస్ట్ అప్డేట్. పాత్ర తీరుతెన్నులు ఇంకా తెలియలేదు. వాస్తవానికి ఈ క్యారెక్టర్ కు ముందు దుల్కర్ సల్మాన్ ని అనుకున్నారు. కానీ డేట్లు తదితర సమస్యల వల్ల ఆ స్థానంలో రానా వచ్చినట్టు తెలిసింది. రానా నిర్మాణంలోనే దుల్కర్ 'కాంత'లో హీరోగా చేయడం ఈ లింక్ ముడిపడేందుకు దోహదం చేసినట్టు అంతర్గత సమాచారం. సో మిరాయ్ లో తేజ, మనోజ్ తో పాటు రానా జత కట్టడం హైప్ పరంగా చాలా ప్లస్ కానుంది మానవాళికి సవాల్ గా మారిన ఒక అంతుచిక్కని రహస్యం కోసం సాహస యాత్రలు చేసే యువకుడిగా తేజ ఇందులో డైనమిక్ గా కనిపించనున్నట్టు వినికిడి. మార్కెట్ ఎంతనేది కాకుండా కంటెంట్ ని నమ్మి పీపుల్స్ మీడియా వంద కోట్లకు పైగా పెడుతోంది. రాజా సాబ్, మిరాయ్ లాంటి రెండు ప్యాన్ ఇండియా మూవీస్ ని ఒకేసారి సెట్స్ మీద పెట్టిన పీపుల్స్ మీడియా వీటి మీద అయిదు వందల కోట్లకు పైగానే బడ్జెట్ పెట్టినట్టు తెలుస్తోంది. విడుదల పరంగా రెండింటి మధ్య గ్యాప్ వచ్చేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ప్యాన్ ఇండియా భాషలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ముఖ్యమైన లాంగ్వేజెస్ లో మిరాయ్ విడుదల కానుంది.రవితేజ ఈగల్ తర్వాత కార్తీక్ ఘట్టమనేని ఎలాగైనా బ్లాక్ బస్టర్ కొట్టాలన్న కసితో మిరాయ్ మీద పని చేస్తున్నాడు. విజువల్స్ అబ్బురపరిచేలా ఉంటాయని విఎఫ్ఎక్స్ గురించి వినిపిస్తున్న టాక్. ఇదే నిజమైతే తేజ సజ్జ ఇమేజ్ మరింత ఎగబాకినట్టే.

# 'అర్జున్ రెడ్డి' హీరోయిన్ని ఇబ్బంది పెట్టిన దర్శకుడెవరు?



'అర్జున్ రెడ్డి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఉత్తరాది అమ్మాయి.. షాలిని పాండే. మన సినిమాల్లో మామూలుగా కనిపించే గ్లామర్ హీరోయిన్లకు భిన్నమైన పాత్రలో ఆమె సటిల్‌గా యాక్ట్ చేసి మెప్పించింది. బోల్డ్ సీన్లలోనూ ధైర్యంగా నటించింది. ఐతే ఈ సినిమాతో బ్లాక్ బస్టర్ విజయాన్నందుకున్నప్పటికీ షాలిని కెరీర్ అనుకున్నంతగా ముందుకు సాగలేదు. మహానటి, యన్.టి.ఆర్ లాంటి చిత్రాల్లో చిన్న పాత్రలు చేసిన ఆమె.. 118, ఇద్దరి లోకం ఒకటే లాంటి చిత్రాల్లో కథానాయికగా చేసింది. తొలి సినిమా తర్వాత సరైన బ్రేక్ రాకపోవడంతో ఆమె కనుమరుగైపోయింది. మధ్యలో 100 పర్సంట్ కాదల్ (100 పర్సంట్ లవ్ రీమేక్), గొరిల్లా లాంటి తెలుగు చిత్రాల్లో సైతం నటించింది. ప్రస్తుతం హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు చేసుకుంటున్న షాలిని.. ఓ ఇంటర్వ్యూలో ఓ సంచలన విషయంతో వార్తల్లోకి వచ్చింది. తాను నటించిన ఓ దక్షిణాది చిత్రం షూటింగ్ సందర్భంగా దర్శకుడు తనతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆమె వెల్లడించింది. తాను వ్యానిటీ వ్యాన్‌లో బట్టలు మార్చుకుంటుండగా.. కనీసం డోర్ కొట్టకుండా ఆ దర్శకుడు లోపలికి వచ్చేశాడని ఆమె వెల్లడించింది. తన వయసు అప్పుడు 22 ఏళ్లని, ఓ సగటు అమ్మాయిలా అప్పుడు ప్రవర్తించానని.. గట్టిగా అరిచేశానని.. ఆ దర్శకుడిని చెడామడా తిట్టేశానని ఆమె తెలిపింది. అది దక్షిణాది చిత్రం అని మాత్రమే అని చెప్పిన షాలిని.. తెలుగా, తమిళమా అన్నది మాత్రం వెల్లడించలేదు. దీంతో షాలినితో అలా ప్రవర్తించిన దర్శకుడెవరన్నది సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

# అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లకు వందన గుడ్‌బై



అంతర్జాతీయ హాకీ పోటీలకు వందన కటారియా గుడ్‌బై చెప్పింది. మంగళవారం ట్విటర్ (ఎక్స్)లో 32ఏళ్ల వందన ఈ విషయాన్ని వెల్లడించింది. '15ఏళ్లపాటు అంతర్జాతీయ హాకీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించేందుకు సహకరించిన కోచ్‌లు, సహాయ సిబ్బందితోపాటు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరిగా ధన్యవాదాలు తెలిపింది. తాను మరిన్ని మ్యాచ్‌లు ఆడాలని ఉన్నా.. భారతజట్టు మరింత మెరుగైన దశలో ఉండాలని కోరుకుంటుంన్నందునే వైదొలుగుతున్నట్లు' వెల్లడించింది. యువ క్రీడాకారిణికులకు అవకాశమివ్వాలనే ఉద్దేశ్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. 'హాకీ లీగ్'లలో ప్రాతినిధ్యం వహిస్తానని తెలిపింది. భారత్ తరఫున 329 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన వందన.. 158 గోల్స్ కొట్టింది. 15ఏళ్ల పాటు అంతర్జాతీయ మ్యాచ్‌లకు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన వందన.. దేశం తరఫున అత్యధిక హాకీ మ్యాచ్‌లు ఆడిన తొలి క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది.

# పెద్ద రేటు పలికిన 'పెద్ది' సంగీతం



రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు కలయికలో రూపొందుతున్న పెద్ది ఫస్ట్ లుక్ ఇటీవలే విడుదలై అంచనాలకు కావాల్సిన మొదటి పునాది బలంగానే వేసింది. లుక్స్ పరంగా పుష్ప, రంగస్థలంతో పోలిక వచ్చినప్పటికి ఫ్యాన్స్ కోరుకున్న రీతిలోనే ఉండటంతో వాళ్ళు హ్యాపీగానే ఉన్నారు. ఇదిలా ఉండగా పెద్ది ఆడియో రైట్స్ టి సిరీస్ సంస్థ 25 కోట్లకు సొంతం చేసుకుందనే వార్త హాట్ టాపిక్‌గా మారనుంది. ఇక్కడ ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ బ్రాండ్ తో పాటు చరణ్ మార్కెట్ వేల్యూ ఇంత మొత్తాన్ని వచ్చేలా చేసింది. గేమ్ ఛేంజర్ ప్రభావంతో సంబంధం లేకుండా ఇంత రేట్ పలకడం విశేషమే. నిజానికి ఏఆర్ రెహమాన్ ఆయన స్థాయి ఫామ్ చూపించి సంవత్సరాలు గడిచిపోయాయి. క్రమం తప్పకుండా సినిమాలు చేస్తున్నారు కానీ ఒకప్పటి ప్రేమికుడు, బొంబాయి, భారతీయుడు మేజిక్ మిస్సవుతోందని ఫ్యాన్స్ ఫీలవుతున్నారు. కానీ బుచ్చిబాబు దగ్గరుండి మరీ బెస్ట్ సాంగ్స్ చేయించుకున్నాడనే టాక్ మెగా కాంపౌండ్ లో ఉంది. సహజంగా తానిచ్చిన ట్యూన్ ని మార్చడానికి ఒప్పుకోని రెహమాన్ పెద్ది కథ డిమాండ్, దర్శకుడి విన్నపం మేరకు మార్పులకు సైతం ఎస్ చెప్పారట. టీజర్ వీడియోకే రెండు మూడు సార్లు వర్క్ చేశారంటే పెద్ది మీద ఏ స్థాయిలో పని జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఏప్రిల్ 8 పెద్ది నుంచి చిన్న టీజర్ రానుంది. ఒక షాట్ కోసం వెయ్యిసార్లు చూస్తారని నిర్మాత రవిశంకర్ ఊరించడం అభిమానుల చెవుల్లో మారుమ్రోగుతోంది. సినిమా విడుదల ఎప్పుడనేది చెప్పకపోయినా హైప్ పరంగా సోషల్ మీడియాలో పెద్ద చర్చే జరుగుతోంది. ఇప్పటిదాకా మూడు పాటల రికార్డింగ్ పూర్తి చేసుకున్న పెద్దిలో ఇంకో రెండు ఉన్నాయట.

# దక్షిణాఫ్రికా జట్టుకు భారీ ఎదురుదెబ్బ..



దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. జట్టు ప్రధాన కోచ్ రాబ్ వాల్టర్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని ఏప్రిల్ 1న దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. అకస్మాత్తుగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రోటీస్ జట్టుకు ఊహించని పరిస్థితి ఎదురైంది. అయితే వాల్టర్ ఏప్రిల్ 30 వరకు జట్టుతో కొనసాగనున్నారు. గత కొంతకాలంగా దక్షిణాఫ్రికా జట్టు అన్ని ఫార్మాట్లలో నిలకడగా రాణిస్తోంది. వన్డేలు, టీ20ల్లో ప్రదర్శన మెరుగుపడటానికి ప్రధాన కోచ్ రాబ్ వాల్టర్ కీలక భూమిక పోషించారు. ఇటీవల జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. అంతేకాకుండా 2024లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా ఫైనల్ చేరుకుంది. జట్టు విజయంలో రాబ్ వాల్టర్ వ్యూహాలు కీలకంగా మారాయి. రాబ్ వాల్టర్ రాజీనామా ప్రకటనపై దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు అధికారికంగా స్పందించింది. వ్యక్తిగత కారణాల వల్లనే కోచ్ పదవికి రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బోర్డు కూడా ఈ నిర్ణయాన్ని ఆమోదించింది. అయితే, రాజీనామా వెనుక అంతరంగ కారణాలపై మాత్రం స్పష్టత లేదు. రాజీనామా సందర్భంగా రాబ్ వాల్టర్ భావోద్వేగంగా స్పందించారు. "ప్రోటీస్‌కు కోచ్‌గా ఉండటం నా జీవితంలో గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. జట్టు, సహాయక సిబ్బంది, క్రికెట్ బోర్డు నాకు గొప్ప సహాయసహకారాలు అందించారు. ఈ ప్రయాణం నాకు చిరస్మరణీయమైనది. అయినప్పటికీ ఇప్పుడే బాధ్యత నుంచి తప్పుకునే సమయం వచ్చిందని భావిస్తున్నాను. భవిష్యత్తులో జట్టు మరిన్ని విజయాలను సాధిస్తుందని నాకు నమ్మకం ఉంది" అని ఆయన అన్నారు. వాల్టర్ రాజీనామా తర్వాత దక్షిణాఫ్రికా కొత్త ప్రధాన కోచ్ ఎవరన్న దానిపై ఇప్పటివరకు స్పష్టత లేదు. బోర్డు త్వరలో కొత్త కోచ్ ఎంపిక ప్రక్రియ ప్రారంభించనున్నట్లు సమాచారం. ప్రస్తుత సమయంలో రాబ్ వాల్టర్ జట్టుతో ఏప్రిల్ 30 వరకు కొనసాగనున్నారు. దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టుకు ఇది కీలకమైన సమయం. ముఖ్యంగా టీ20 ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ ప్రధాన కోచ్ లేకపోవడం జట్టుపై ప్రభావం చూపనుంది. కొత్త కోచ్ ఎవరు అనే దానిపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 2024లో కేఎల్ రాహుల్.. ఇప్పుడు రిషబ్ పంత్!

ఐపీఎల్ 2025లో మంగళవారం లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ), పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్) మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ సీజన్-18లో వరుసగా రెండో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో లక్నో కెప్టెన్ రిషభ్ పంత్ మరోసారి నిరాశపరిచాడు. అయితే పంజాబ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ అద్భుత ప్రదర్శన చేశాడు. పంత్ ఫామ్ లేకపోవడం జట్టు ఆందోళనను పెంచింది. పంజాబ్ చేతిలో ఓడిన తర్వాత ఎల్ఎస్‌జీ యజమాని సంజీవ్ గోయెంకా ఇరు జట్ల కెప్టెన్లను కలిశారు. ఇప్పటివరకు సీజన్-18లో లక్నో సూపర్ జెయింట్స్ 3 మ్యాచ్‌లు ఆడింది. అందులో పంత్ జట్టు 2లో ఓడి, ఒకటిలో గెలిచింది. పంజాబ్ కింగ్స్ చేతిలో 8 వికెట్ల తేడాతో ఓడిన తర్వాత.. ఎల్ఎస్‌జీ యజమాని సంజీవ్ గోయెంకా కెప్టెన్ రిషభ్ పంత్‌తో తీవ్రంగా చర్చిస్తూ కనిపించారు. ఈ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అటు సంజీవ్ గోయెంకా పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌తో కూడా సంభాషించారు. అయితే ఈ సమయంలో ఆయన సంతోషంగా కనిపించారు. ఈ మ్యాచ్‌లో ఎల్ఎస్‌జీ కెప్టెన్ పంత్ విఫలమైతే, పంజాబ్ కెప్టెన్ అయ్యర్ హిట్‌గా నిలిచారు. కాగా 2024లో ఓ మ్యాచ్‌లో ఓడిపోయిన తర్వాత అప్పటి లక్నో కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో సంజీవ్ ఇలానే మాట్లాడిన విషయం తెలిసిందే. దీంతో నెటిజన్లు అప్పుడు రాహుల్, ఇప్పుడు పంత్ అని కామెంట్స్ చేస్తున్నారు. రిషభ్ పంత్ ఐపీఎల్ 2025లో అత్యధిక ధర పలికిన ఆటగాడు. లక్నో సూపర్ జెయింట్స్ మెగా వేలంలో పంత్‌ను 27 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. కానీ ఇప్పటివరకు పంత్ తన ప్రదర్శనతో జట్టును, అభిమానులను నిరాశపరిచాడు. మొదటి మ్యాచ్‌లో ఎల్ఎస్‌జీ ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడగా, పంత్ ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. ఆ తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 15 బంతుల్లో 15 రన్స్ చేశాడు. ఇప్పుడు పంజాబ్‌తో మ్యాచ్‌లో కేవలం 2 రన్స్‌తో ఔటయ్యాడు.



"PEN SATTA" Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : 98853 15759, RNI.NO.APTEL/2023/87729, E-mail:anilchintamaneni@gmail.com